సేవాదళం.. స్వచ్ఛ యజ్ఞం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మట్టి కుప్పలను తొలగిస్తున్న కనిగిరి ఏబీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

కనిగిరి, కంభం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా యువతరం తమ బాధ్యతను గుర్తించింది. పరిసరాల పరిశుభ్రతకు మంగళవారం నడుం కట్టింది. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో పలుగు, పార, చీపుళ్లు చేతబట్టి కదిలింది. ప్రభుత్వ కార్యాలయాలు, పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న చెరువు కట్టపై పరిసరాలను శుభ్రపరిచింది. ఈ స్వచ్ఛ యజ్ఞంలో కనిగిరిలో ఏబీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, కంభం వాసవీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, క్యాడెట్‌లు, విద్యార్థులు పాలుపంచుకున్నారు.

- వివరాలు 8లో



కంభం చెరువు కట్టపై చెత్తాచెదారాన్ని ఏరివేస్తున్న వాసవీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్‌లు

ఆబాల గోపాలం.. ముందస్తు సంబరం



దసరా ముందస్తు వేడుకలను జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రులు, విజయదశమి ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం నవ దుర్గల అలంకరణలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

మా పాప ఎలా చదువుతోంది టీచర్!



'టీచర్ మా పాప ఎలా చదువుతోంది. ఏదేని పాఠ్యాంశాల్లో వెనుకబడిందా. మీరిచ్చిన హోం వర్క్ బాగానే చేస్తుంది కదా! ఇంకా ఏమైనా మెరుగుపడాలా!' తమ చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకునే పాఠశాలలకు వెళ్లినపుడు అక్కడి ఉపాధ్యాయులను తల్లిదండ్రులు అడిగి తెలుసుకునే విషయాలివే. జిల్లా కలెక్టర్‌గా నిత్యం విధి నిర్వహణలో తలమునకలై ఉండే తమీమ్ అన్సారియా కూడా తన పాప విషయంలో అదే శ్రద్ధ చూపారు. కాస్త సమయం దొరకబుచ్చుకుని తన బిడ్డ చదువుతున్న పాఠశాలకు మంగళవారం వెళ్లారు. అక్కడ నిర్వహించిన టీచర్, పేరెంట్స్ సమావేశంలో ముఖాముఖి పాల్గొన్నారు. పాపకు సంబంధించిన అన్ని విషయాలపై తరగతి ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకున్నారు. - న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

12 నుంచి కొత్త కిక్కు

- జిల్లాలో 171 మద్యం దుకాణాలు
- మండలం యూనిట్‌గా అనుమతులు

జిల్లాలో నూతన ఎక్సైజ్ విధానానికి సంబంధించిన ప్రకటన మంగళవారం విడుదలైంది. ఇందుకు సంబంధించిన గెజిట్‌పై కలెక్టర్ తమీమ్ అన్సారియా సంతకం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో నిర్వహణను ఇకపై ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించనున్నారు. జిల్లా పరిధిలో పది ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 171 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. అందులో అత్యధికంగా ఒంగోలు నగరంలో 20 దుకాణాలున్నాయి. ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 11న కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ తీస్తారు. 12వ తేదీ నుంచి నూతన మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి.

– న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం,

మార్కాపురంలో తక్కువ...: ఒంగోలు తర్వాత జిల్లాలో పెద్ద పట్టణం మార్కాపురం. ఇది గ్రేడ్-2 మున్సిపాలిటీ. ఒంగోలు నగర పాలకసంస్థ పరిధిలో 20 దుకాణాలు ఏర్పాటు చేయనుండగా. . మార్కాపురం మున్సిపాలిటీలో నాలుగు, గ్రామీణం పరిధిలో మూడు కలిపి మొత్తంగా ఏడింటికి అనుమతి లభించింది. ఇందుకు భిన్నంగా గెలాక్సీ గ్రానైట్‌కు ప్రసిద్ధినొందిన చీమకుర్తి(గ్రేడ్-2 మున్సిపాలిటీ)లో అయిదు, మండలంలో మరో నాలుగు దుకాణాలకు అనుమతిచ్చారు. కనిగిరి నగర పంచాయతీలో ఆరు, మండలంలో మరో మూడు మొత్తం తొమ్మిది దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. దర్శి నగర పంచాయతీలో అయిదు, మండలంలో మరో నాలుగు కేటాయించడం గమనార్హం.



ఒంగోలైనా.. పుల్లలచెరువైనా ఒక్కటే...

ఒక్కొక్క దుకాణానికి దరఖాస్తు ఫీజు రూ.రెండు లక్షలుగా నిర్ణయించారు. ఇది పూర్తిగా నాన్ రీఫండబుల్ డిపాజిట్. తద్వారా ప్రభుత్వానికి రూ.3.42 కోట్ల ఆదాయం సమకూరనుంది. 2019కు ముందు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని దుకాణాలు ఏర్పాటుచేసి తదనుగుణంగా ఎక్సైజ్ పన్ను నిర్ణయించేవారు. ఈ దఫా భిన్నంగా వ్యవహరించారు. మండలాన్ని యూనిట్‌గా చేసుకుని ఎక్సైజ్ పన్ను ఖరారు చేశారు. పది వేలలోపు జనాభా ఉన్న మండలంలో దుకాణాలకు రూ.50 లక్షలు చెల్లించాల్సి ఉండగా.. ఈ కేటగిరీలో ఒక్క మండలమూ జిల్లాలో లేదు. యాభై వేల పైచిలుకు జనాభా ఉన్న మండలాల్లో ఒక్కొక్క దుకాణానికి 2024-25 రూ.65 లక్షలుగా, 2025-26 సంవత్సరానికి 71.50 లక్షలుగా నిర్ణయించారు. దీంతో ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసే దుకాణానికైనా, పుల్లలచెరువు మండలంలోని మారుమూల పంచాయతీలో నెలకొల్పినా ఒకే తరహా ఎక్సైజ్ పన్ను విధానం అమలు కానుంది. లాటరీలో తగిలితే మండలంలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చనే వెసులుబాటు కల్పించారు.

ఆ ప్రాంతాలకు కాసింత మినహాయింపు...

జిల్లాలోని 39 మండలాల్లో(ఒంగోలు గ్రామీణంతో కలిపి) కేవలం కొండపి, పొన్నలూరు, జరుగుమల్లి, కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల్లో మాత్రమే 50 వేల్లోపు జనాభా ఉన్నారు. దీంతో ఇక్కడ మొదటి సంవత్సరం రూ.55 లక్షలు, రెండో ఏడాదికి రూ.60.50 లక్షలు ఎక్సైజ్ ఫీజుగా చెల్లించాల్సి ఉంది.



జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్లు:	10
మద్యం దుకాణాలు:	171
దరఖాస్తు రుసుము ఆదాయం:	రూ. 3.40 కోట్లు
ఎక్సైజ్ పన్ను (2024-25):	రూ.108 కోట్లు
పన్ను ఆదాయం (2025-26):	రూ.140 కోట్లు
దుకాణాల కేటాయింపు:	లాటరీ పద్ధతిన
దరఖాస్తుల స్వీకరణ:	ఇప్పటికే ప్రారంభం
లాటరీ:	అక్టోబర్ 11
నూతన దుకాణాల ఏర్పాటు:	అక్టోబర్ 12 నుంచి

పండగకు 149 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకుని ఈ నెల 8 నుంచి 11 వరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు 149 సర్వీసులను ఆర్టీసీ ప్రత్యేకంగా నడపనుంది. వీటిలో హైదరాబాద్‌కు 136, బెంగళూరుకు 8, చెన్నైకు 5 సర్వీసులు కేటాయించారు. రానుపోను ఒకేసారి రిజర్వేషన్ చేసుకున్న వారికి సాధారణ ఛార్జీల్లో పది శాతం రాయితీ కల్పిస్తున్నట్లు డీపీటీవో బి.సుధాకర్ తెలిపారు. గిద్దలూరు డిపో నుంచి హైదరాబాద్‌కు 24, కనిగిరి నుంచి 33, మార్కాపురం నుంచి 22, ఒంగోలు నుంచి 40, పొదిలి నుంచి 17 సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్, ఇంద్ర సర్వీసులను నడపనున్నట్లు డీపీటీవో వివరించారు.

టెట్‌కు 11,566 మంది అభ్యర్థులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఒంగోలు ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు; మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు పూటలా పరీక్షలుంటాయన్నారు. మొత్తం 11,566 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. కేంద్రాల వద్ద బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు చెప్పారు. సకాలంలో ఆర్టీసీ బస్సులు నడపాలని, డీఈవో కార్యాలయంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో సుభద్ర, డిప్యూటీ డీఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

మొదటి రోజే 97.06 శాతం పింఛన్ల పంపిణీ



ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని మొదటి రోజైన మంగళవారం 97.06 శాతం మంది లబ్ధిదారులకు సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 2,88,144 మంది లబ్ధిదారులు ఉండగా, అందుకు రూ.122.64 కోట్ల మేర నగదు విడుదలైంది. రాత్రి 9 గంటలకు 2,79,665 మందికి రూ.119.02 కోట్ల నగదు అందజేశారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి స్వామి.. చిత్రంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్. విజయకుమార్, అధికారులు

వృద్ధులు.. అనుభవాల గనులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వృద్ధులు అనుభవాల గనులని. . వారి సేవలు సమాజానికి ఎంతో అవసరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఒంగోలు ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొని మాట్లాడారు. వృద్ధుల సంక్షేమంతో పాటు, సమాజాభివృద్ధికి వారి సూచనలు తీసుకోవడానికి గ్రామాల్లో సీనియర్ సిటిజన్స్ క్లబ్‌ల ఏర్పాటు దిశగా ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ నమోదుకు ప్రత్యేక ఏర్పాట్లతో పాటు, వార్డులను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. సంరక్షణ విషయంలో ఎదురయ్యే ఇబ్బందులపై ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నం. 14567 పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, ఏఎస్పీ నాగేశ్వరరావు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.రవిప్రకాష్‌రెడ్డి, ఎండీ ఎంఏ.కుమార్ రాజా, ఏడీ జి.అర్చన, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఏపీ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సన్మానించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి.




ఆకట్టుకున్న విద్యార్థిని నృత్య ప్రదర్శన

దసరా కానుకగా కందిపప్పు

- ఈ నెల నుంచే పంపిణీకి చర్యలు
- ప్రాధాన్య క్రమంలో కేటాయింపులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే:

వైకాపా ప్రభుత్వ హయాంలో పంచదార, కందిపప్పు తదితర నిత్యావసర వస్తువుల ప్యాకెట్లపై నాటి సీఎం జగన్ మోహన్ రెడ్డి బొమ్మ, పచ్చరంగుతో పేర్లు ఉండేవి. పైగా ఆ సంచుల్లో ఉండే సరకుల తూకం 50 గ్రాముల వరకు తక్కువగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచదార, కందిపప్పు ప్యాకెట్లపై రంగు మార్చారు. గోదాముల్లో అప్పటికే నిల్వ ఉన్న వాటిని సరైన తూకంతో తిరిగి కొత్తగా ప్యాకింగ్ చేయించింది. గత నెలలో పూర్తిస్థాయిలో పంచదార సరఫరా చేయగా; ఈ నెలలో కందిపప్పు సరఫరాను పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఇప్పటికే జిల్లా అధికారులకు సమాచారం అందింది. ఈ నెల 12న విజయ దశమితో పాటు, ఆ తర్వాత రానున్న వరుస పండగల వేళ పేద కుటుంబాలకు తీపి కబురు అందించింది. అక్టోబర్ నెలా కోటా కింద జిల్లా అంతటా మంగళవారం నుంచి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ ప్రారంభమైంది.



కొత్తగా తయారుచేసిన కందిపప్పు ప్యాకింగ్

మరో వారంలో పూర్తిస్థాయి నిల్వలు...

జిల్లాలోని కార్డుదారులకు పంపిణీ చేసేందుకు 350 టన్నుల కందిపప్పును ప్రభుత్వం కేటాయించింది. అందులో ఇప్పటివరకు 35 టన్నుల నిల్వలు జిల్లాకు చేరాయి. తొలి విడతగా ఒంగోలు నగరానికి 5 టన్నులు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాలకు 2.50 టన్నుల చొప్పున కేటాయించారు. దీంతో ఆయా చోట్ల పంపిణీ ప్రారంభించారు. తాజాగా మంగళవారం మరో 25 టన్నులు జిల్లాకు చేరడంతో ప్రాధాన్యతా క్రమంలో పశ్చిమ ప్రకాశానికి కేటాయించేలా ప్రణాళిక చేశారు. మరో వారం రోజుల్లో నిల్వలు పూర్తిస్థాయిలో రానున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఈ నెలలో కొన్ని కుటుంబాలకు కందిపప్పు అందనుండగా; నవంబర్ నుంచి వంద శాతం కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు.



ఒంగోలులోని ట్రంక్‌రోడ్డులో ఎండీయూ వాహనం వద్ద సరకులు తీసుకుంటున్న కార్డుదారులు

బాలికా విద్యకు పెద్దపీట

- కేజీబీవీలుగా అయిదు ఉన్నత పాఠశాలలు
- వసతి గృహాల్లో సమకూరనున్న సౌకర్యాలు



పేద కుటుంబాల్లోని ఆడపిల్లలను మధ్యలోనే చదువు మాన్పించకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని అయిదు జడ్పీ ఉన్నత పాఠశాలలను కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలుగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో టైప్-4 కేజీబీవీలను ఏర్పాటు చేశారు. అనుబంధంగా వసతి గృహాలు నిర్మించారు. కనీస సౌకర్యాలకు నిధులు ఇవ్వకపోవడంతో ఏడాది నుంచి అవి నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వం వీటిని వినియోగంలోకి తెచ్చి కేజీబీవీలుగా నిర్వహించడానికి ఇప్పుడు నిధులు కేటాయించింది. - న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఒక్కో చోట వంద మంది...: గత ప్రభుత్వ హయాంలో అయిదు ఆదర్శ పాఠశాలలను కేజీబీవీలుగా మార్పు చేశారు. దొనకొండ, పెద్దారవీడు మండలం ఏనుగులదిన్నె, తాళ్లూరు, కొత్తపట్నం, సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలను కూడా మార్చడానికి అనుబంధంగా బాలికల వసతి గృహాలు నిర్మించారు. వాటిలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇంతవరకు అక్కరకు రాకుండా పోయాయి. ఇకపై ఆ అయిదు జడ్పీ పాఠశాలలు కేజీబీవీలుగా పనిచేస్తాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థినులు వసతి గృహంలో ఉంటూ చదువుకోవచ్చు. ఒక్కో చోట వంద మంది ఉండేలా సౌకర్యాలు కల్పిస్తారు. ఇప్పుడు కేటాయించిన నిధులతో మరమ్మతులు, విద్యుత్తు సౌకర్యం, పారిశుద్ధ్య సంబంధ పనులు చేపడతారు. అవి పూర్తయ్యాక విద్యార్థినులకు కేటాయిస్తారు.

50 పోస్టుల మంజూరు...: జిల్లాలో పాత కేజీబీవీలు 28 ఉండగా., అయిదు ఆదర్శ పాఠశాలలను గత ఏడాది టైప్-4 కేజీబీవీలుగా మార్చారు. ఇప్పుడు మరో అయిదు కొత్తగా ప్రారంభం కాబోతున్నాయి. పాత వాటిల్లో ఆరు నుంచి ఇంటర్ వరకు ఉండగా, కొత్త వాటిలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులుంటారు. వసతి గృహాల్లో పనిచేయడానికి వార్డెన్లను నియమించనున్నారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి ప్రకటన ఇచ్చారు. జిల్లాలో రెండు పీఈటీ, 21 కాంట్రాక్టు సీఆర్‌టీ, 10 పీజీటీ, 8 పార్ట్‌టైం అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, మూడు వార్డెన్, ఆరు అకౌంటెంట్ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు కోరారు.



దొనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



బకింగ్‌హామ్ కాలువలో పెదగంజాం వద్ద గతంలో పడవలు నిలిపే ప్రదేశం

లాహిరి లాహిరి.. ఎప్పుడో మరి!

- పునరుద్ధరణకు నోచని బకింగ్‌హామ్ కాలువ
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ కదలిక

ఈనాడు, ఒంగోలు:

బకింగ్‌హాం కాలువ.. బ్రిటిష్ పాలకుల కాలంలో ఓ వెలుగు వెలిగింది. బంగాళాఖాతం వెంబడి జిల్లాకు మణిహారంగా విరాజిల్లింది. లాంచీలు, బోట్లు, పడవల రాకపోకలతో కళకళలాడింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చినగంజాం నుంచి రామయపట్నం వరకు సుమారు వంద కిలో మీటర్లకు పైగా పొడవుతో.. సముద్రానికి కొన్నిచోట్ల అర కిలోమీటరు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గతంలో ఈ కాలువ వెంట వ్యాపారం జోరుగా సాగేది. చినగంజాం, కొత్తపట్నం, పాకల, ఊళ్లపాలెం, కరేడు, రామాయపట్నం పరిధిలో చేపల వేట చేస్తూ మత్స్యకారులు ఉపాధి పొందేవారు. దివిసీమ ఉప్పెన సమయంలో కాలువ అక్కడక్కడా దెబ్బతినడంతో జల రవాణా ఆగిపోయింది. ఆ తర్వాత అక్రమార్కుల కళ్లు కాలువపై పడ్డాయి. చేపలు, రొయ్యల చెరువులు ఏర్పాటయ్యాయి. కొన్నిచోట్ల నిర్వహణ లేక పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెరిగాయి.

ఆచరణ రూపం దాల్చని ప్రతిపాదనలు...: యూపీఏ-2 పాలనలో జల రవాణా అభివృద్ధి పథకంలో భాగంగా బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణకు ప్రతిపాదనలు చేసింది. నిపుణుల కమిటీ పరిశీలించి సుమారు రూ.1,500 కోట్ల వరకు వ్యయమవుతుందని నివేదిక ఇచ్చింది. ఆక్రమణలు తొలగించాలని సూచించింది. అవేమీ కార్యరూపం దాల్చలేదు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం సాగరమాల పథకం తెచ్చింది. అందులో భాగంగా కాలువను జల రవాణాకు అనువుగా తీర్చిదిద్దుతామని ప్రకటించినప్పటికీ చర్యలు లేవు.

గతమెంతో ఘనం...

- జల రవాణా: 1850 నుంచి 1960 వరకు
- పొడవు: సుమారు 430 కిలో మీటర్లు (కాకినాడ నుంచి చెన్నై వరకు.. రాష్ట్రంలో 262 కి.మీ)
- సరకు రవాణా: నిత్యం 12 మిలియన్ టన్నులు
- వందకు పైగా లాకులు, పదుల సంఖ్యలో అతిథి గృహాలు కాలువ వెంట ఉండేవి.
- కాకినాడ నుంచి గుంటూరు, అక్కడి నుంచి కొమ్మూరు కాలువ ద్వారా చినగంజాం వరకు రవాణా సాగేది. అక్కడ సరకును మరో పడవలోకి మార్చి బకింగ్‌హామ్ కాలువ ద్వారా చెన్నై తరలించేవారు.

సర్వేలు.. నోటీసులు...: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాలువ పనులపై కదలిక మొదలైంది. జల రవాణాకు అనుగుణంగా కాలువను విస్తరించే విషయాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. జిల్లా అధికారులు కూడా కాలువపై పెద్ద పడవలు వెళ్లేలా రీ డిజైన్ చేయడానికి వీలుగా సర్వే చేశారు. కాలువ 700 మీటర్ల పొడవు, వెడల్పుతో ఉండేలా ప్రతిపాదనలు పంపించారు. ఆ మేరకు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు.

హైకోర్టుకు జడ్పీ బదిలీల పంచాయితీ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇటీవల చేపట్టిన ఉద్యోగుల బదిలీల పంచాయితీ ఇప్పుడు హైకోర్టుకు చేరింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ సాగిందంటూ జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56 మండలాలున్నాయి. అందులో 32 మంది ఎంపీడీవోలకు ఇటీవల స్థానచలనమైంది. జడ్పీ, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల పరిధిలో మొత్తం 1,049 మంది ఉద్యోగులు ఉండగా; అందులో 512 మందికి బదిలీలయ్యాయి. ఉద్యోగులూ కొత్త స్థానాల్లో చేరారు. ఈ సమయంలో బదిలీల ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టలేదంటూ జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ డైరెక్టర్‌తో పాటు, కలెక్టర్, జడ్పీ సీఈవో, ఉప సీఈవో హనుమంతరావు, పూర్వ సీఈవో మాధురిని ప్రతివాదులుగా చేర్చారు.

స్వేదం చిందించి స్వచ్ఛ యజ్ఞం

ఈనాడు-ఈటీవీ పిలుపునందుకుని విద్యార్థి లోకం కదం తొక్కింది. పలుగు, పార, చీపుళ్లు చేత బట్టి స్వచ్ఛ సంకల్పంతో అడుగులేసింది. యువతరం.. శిరమెత్తితే.. నవతరం గళమెత్తదా అంటూ కనిగిరి, దర్శి పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పార్కుల్లో శ్రమదానం చేసింది. చారిత్రక కంభం చెరువులో స్వేదం చిందించి చిల్లచెట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి ఎందరిలోనో స్ఫూర్తి నింపింది.

◗ మూడు పట్టణాల్లో కదంతొక్కిన విద్యార్థి లోకం ◗ ఈనాడు ETV ఆధ్వర్యంలో జోరుగా శ్రమదానం



ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలో విద్యార్థుల ర్యాలీ


కనిగిరిలో విద్యార్థులతో కలసి సీఐ ఖాజావలి శ్రమదానం


పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థినులు


చెత్తను కుండీలో పోస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కనిగిరి, న్యూస్‌టుడే : ఈనాడు -ఈటీవీ ఆధ్వర్యంలో కనిగిరి ఏబీఆర్ ఇంజినీరింగ్ విద్యార్థులు మంగళవారం స్వచ్ఛతాహీ సేవాలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఉప ఖజానా, పోలీస్ స్టేషన్ ఆవరణలను శుభ్రం చేశారు. పలుగు, పార, చీపుళ్లు, చేతపట్టి చిల్లచెట్లను తొలగించారు. ముందుగా ఏబీఆర్ ఇంజినీరింగ్ కళాశాలల డైరెక్టర్ ఆవుల బసిరెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డీఎవో కరువది బాలాజీ విశ్వనాథ్, కనిగిరి సీఐ షేక్ ఖాజావలి శ్రమదానంలో పాల్గొన్నారు. వెలిగండ్ల, ఎంఈవో దేవిరెడ్డి రామిరెడ్డి, జేవీవీ రాష్ట్ర నాయకులు షేక్ గయాజ్ బాషా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏబీఆర్ కళాశాలల ప్రిన్సిపల్ డా. దేవిరెడ్డి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

చారిత్రక కంభం చెరువులో..

కంభం : ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో వాసవీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, విద్యార్థులు చారిత్రక కంభం చెరువు కట్టపై స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లతో పాటు విద్యార్థులు సుమారు వందమంది రెండు బస్సుల్లో అక్కడికి చేరుకుని చెరువు గట్టుపై పేరుకున్న వ్యర్థాలు, చెత్తను తీసేశారు. వాసవీ విద్యాసంస్థల కరస్పాండెంట్ గోళ్ల రత్నంబాబు, ప్రిన్సిపల్ రాము, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్శి: 'ఈనాడు- ఈటీవీ, పొట్టి శ్రీరాములు కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం దర్శి పట్టణంలోని పల్లెవనం పార్కు పరిసరాలను విద్యార్థులు శుభ్రం చేశారు. అక్కడి ఎర్ర చెరువు గట్టుపై ఉన్న చిల్లచెట్లను తొలగించారు. కళాశాల డైరెక్టర్ పెద్దిరాజు, సుమారు నలభైమంది ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ బాధ్యులను వదలం

◗ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఉచిత శిక్షణ


సూరారెడ్డిపాలెంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

టంగుటూరు, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ విషయంలో ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదని, ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతోనే సిట్‌ను ఏర్పాటు చేశామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కోర్టుల తీర్పుపై తమకు నమ్మకముందన్నారు. ప్రాథమికంగా నెయ్యి కల్తీ జరిగిందని వెలుగులోకి రావడంతో సిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. సుప్రీం కోర్టు నివేదిక ప్రకారం.. ఆధారాల సేకరణ ప్రాథమిక దశలోనే ఉందన్నారు. అన్ని ఆధారాలను, ల్యాబ్ నివేదికలను త్వరలోనే కోర్టుకు అందజేస్తామన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ జరిపినా తమకు అభ్యంతరం లేదన్నారు. ఒక వేళ అదే జరిగితే దానిని స్వాగతిస్తామన్నారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం అమలు చేస్తామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితాలు మెరుగుపడేలా రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మందికి ఉచిత శిక్షణ కార్యక్రమాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.


కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలో వివిధ సంఘాల నేతలు, విద్యార్థులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తగదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రవేటీకణ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి యువజన రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రం తీసుకునే ఈ నిర్ణయంతో చదువుకున్న విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కోసం విద్యార్థులు, యువకులు పోరాటం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పి.పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ, విశాఖ ప్లాంట్ కోసం పలువురు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ఆంధ్రులు పోరాటం చేస్తుంటే వారి మనోభావాలను పట్టించుకోకుండా కేంద్రం ముందుకు వెళ్లడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో డైఫీ జిల్లా అధ్యక్షుడు కేవీ.పిచ్చయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణానిధి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ పాల్గొన్నారు.

శిథిల బాటకిక సెలవు



ఛిద్రమైన రోడ్లతో అయిదేళ్లుగా పడిన అవస్థలు ఇక దూరం కానున్నాయి. జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుండ్లకమ్మ జలాశయం నుంచి జాతీయ రహదారి వరకూ ఉన్న రెండు కి.మీ రోడ్డును రూ.1.2 కోట్లను నిర్మిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వంద రోజుల్లోనే పనులు మొదలు పెట్టారు. శిథిల రోడ్డు తారు పెచ్చులను పొక్లెయిన్‌తో తవ్వేసి.. ఇలా మెటల్ పరిచి పనులు చేస్తున్నారు.

–ఈనాడు, ఒంగోలు


సిద్ధమవుతున్న కొత్త రహదారి

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: లింగ నిర్ధరణ పరీక్షలు చట్టరీత్యా నేరమనే విషయం ప్రతి ఒక్కరికీ తెలిసేలా స్కానింగ్ కేంద్రాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆమేరకు మంగళవారం వైద్యాధికారులు నగరంలోని కొన్ని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. చట్టంలో పేర్కొన్న నిబంధనలను తెలుగు, ఆంగ్ల భాషల్లో అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. నెలవారీ నివేదికలను ఆన్‌లైన్ ద్వారా పంపించాలన్నారు. అనుమతి లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


స్కానింగ్ కేంద్రం వద్ద బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

త్వరలో భూముల ఫ్రీ హోల్డింగ్ ప్రక్రియ పూర్తి


సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో జరుగుతున్న భూముల ఫ్రీ హోల్డింగ్ పరిశీలన ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఫ్రీ హోల్డింగ్ పరిశీలన ప్రక్రియపై అమరావతి నుంచి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పురోగతిని కలెక్టర్ వివరించారు. పరిశీలన కోసం మండలాల వారీగా ఎస్‌డీసీల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఉన్నతాధికారి పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్


వెంకటేష్‌ను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

పామూరు, న్యూస్‌టుడే: జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడిగా పామూరు-2 ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ ఎన్నికయ్యారు. మంగళవారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి జి.వీరభద్రాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్‌ను జిల్లా సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యుల సమస్యల పరిష్కారానికి, వారి ప్రయోజనాలు కాపాడేందుకు కృషిచేస్తానని చెప్పారు. సంఘం ప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా


ఆశాశ్రీ

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఆశా శ్రీ దండు మూడో స్థానంలో నిలిచినట్లు సంతనూతలపాడు జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాంచీలో జరిగిన ఆల్ ఇండియా సబ్ జూనియర్ పోటీల్లో ఆశాశ్రీ దండు మూడో స్థానంలో నిలిచినట్లు చెప్పారు. పీడీలు బి.శ్రీనివాసరెడ్డి, కె.మల్లికారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీ దరఖాస్తుల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సమగ్రశిక్ష పరిధిలోని కేజీబీవీల్లో ఖాళీ పోస్టులను ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో సుభద్ర తెలిపారు. నోటిఫికేషన్ విడుదల చేశారని, సబ్జెక్టు, రోస్టర్, గౌరవ వేతనం వివరాలు కేజీబీవీ వెబ్‌సైట్‌లో ఉంచారన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేటప్పుడు కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నందున వాటి పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచారన్నారు. సమస్య ఉంటే 70750 39990 కు సంప్రదించాలన్నారు.

దసరా ఉత్సవాలు... ట్రాఫిక్ మళ్లింపు

◗ విజయవాడ మీదుగా నడిచే వాహనాల రాకపోకల్లో మార్పులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా.. నగరం మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. ఈ నెల 2 నుంచి 13వ తేదీ వరకు ఈ మళ్లింపులు ఉంటాయని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

భారీ, చిన్న వాహనాలు ఇలా వెళ్లాలి..

◗ హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, స్వాతి కూడలి, కనకదుర్గా పైవంతెన, కృష్ణలంక, కనకదుర్గమ్మ వారధి, తాడేపల్లి మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి. ◗ హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను.. ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, నూజివీడు, హనుమాన్‌జంక్షన్, ఏలూరు మీదుగా విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. అదే విధంగా చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వై.కూడలి, కబేలా సెంటర్, సీవీఆర్ పైవంతెన, పైపులరోడ్డు, కండ్రిక, బోడపాడు ఆర్‌యూబీ, ఔటర్ రింగ్‌రోడ్డు, ముస్తాబాద, చిన అవుటపల్లి మీదుగా విశాఖపట్నం మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి. ◗ విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను హనుమాన్‌జంక్షన్, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, పెనమూడి వారధి, రేపల్లె, చీరాల, ఒంగోలు మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గన్నవరం, నిడమానూరు, బెంజిసర్కిల్, కనకదుర్గమ్మ వారిధి మీదుగా చెన్నైకు పంపిస్తారు. రామవరప్పాడు వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగితే.. తాడిగడప 100 అడుగుల రోడ్డు మీదుగా బందరురోడ్డు, అక్కడి నుంచి బెంజిసర్కిల్ మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెనుతిరుగుతాయి.

◗ గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను బుడంపాడు, తెనాలి, పెనుమూడి వారధి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు, విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గుంటూరు, కనకదుర్గమ్మ వారిధి, బెంజిసర్కిల్ పైవంతెన, రామవరప్పాడు, నిడమానూరు, గన్నవరం మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



మాట్లాడుతున్న అఖిల భారత క్రైస్తవ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు విజయరాజు, చిత్రంలో సంఘం నాయకులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని అఖిల భారత క్రైస్తవ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఎన్జీవో హోమ్‌లో మంగళవారం జిల్లా పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో దళిత క్రైస్తవులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాలు నోరు తెరవాలన్నారు. కేంద్ర ప్రభుత్వాలు దీనిపై ఎన్నో కమిషన్లు వేయగా, నివేదికలిచ్చాయని, దీనిపై మీనమేషాలు లెక్కించడం తగదన్నారు. ఎస్సీ హోదా సాధనకు భవిష్యత్తు కార్యాచరణ నిమిత్తం సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే నెలలో ఒంగోలులో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఉపాధ్యక్షులు బిషప్ శ్యాంసన్, ఐజాక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడి మృతి

టంగుటూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు మృతిచెందగా.. బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన టంగుటూరు 16వ జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సింగరాయకొండకు చెందిన బురుసు చంద్రమోహన్, బంధువుల కుమారుడు తన్నీరు ఏడుకొండలు (17)తో ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సింగరాయకొండ వస్తుండగా, టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద వాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రమోహన్ అక్కడికక్కడే మృతి చెందగా, ఏడుకొండలుకు స్వల్ప గాయాలయ్యాయి. హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావుకు సమాచారం అందించగా ఆయనొచ్చి 108 వాహనంలో బాలుడిని రిమ్స్‌కి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సు నుంచి జారిపడి...

కనిగిరి : ఆర్టీసీ బస్సు నుంచి దిగుతూ జారిపడి ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో జరిగింది. పీసీపల్లి మండలం పెద అలవలపాడుకు చెందిన వెంకటలక్ష్మమ్మ పని నిమిత్తం ఆర్టీసీ బస్సులో కనిగిరికి బయలుదేరారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్లాట్‌ఫారం వద్దకు బస్సు నెమ్మదిగా వస్తుండగా..ఆమె దిగుతూ జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై శ్రీరామ్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు.

బాకీ చెల్లించమన్నందుకు..

తాళ్లూరు, న్యూస్‌టుడే : నగదు చెల్లించమని కోరిన వ్యక్తిపై బాకీదారుడు దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై మంగళవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు నాగంబొట్లపాలేనికి చెందిన తుపాకుల వెంకటేశ్వర్లు కుమార్తెను లండన్‌లో ఎంబీఏ చదివించాలని నిర్ణయించుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన మీసాల కోటేశ్వరరావు కుమారుడు శివాజీ అక్కడే ఉంటుండటంతో యువతి ఫీజుల నిమిత్తం చెల్లించాల్సిన రూ.10 లక్షల నగదును అతని బ్యాంకు ఖాతాకు పంపించారు. తదుపరి యువతి అక్కడికి వెళ్లి నగదు ఇవ్వాల్సిందిగా కోరగా, తన వద్ద లేవని బదులిచ్చాడు. ఇదే విషయాన్ని యువతి తండ్రికి తెలిపింది. దీంతో వెంకటేశ్వర్లు ఇటీవల కోటేశ్వరరావు వద్దకు వెళ్లి తమ నగదు తిరిగి ఇవ్వాలని కోరగా, ఆగ్రహించిన అతను దాడి చేశాడు. గాయపడిన వెంకటేశ్వర్లు ఆసుపత్రిలో చేరారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారంమేరకు ఎస్సై మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

మార్కాపురం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ ఓ మహిళ విష రసాయనం తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం కొండేపల్లిలో చోటు చేసుకుంది. మార్కాపురం గ్రామీణ ఎస్సై అంకమ్మరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొండేపల్లి గ్రామానికి చెందిన భూపని పుల్లమ్మ (49) గత కొంతకాలంగా కుమార్తెతో పాటు ఉంటోంది. అనారోగ్యానికి గురవ్వగా.. చికిత్స చేస్తున్నా నయం కాకపోవడంతో మంగళవారం ఇంట్లోనే విష రసాయనం తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుమార్తె మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయినట్లు ఎస్సై తెలిపారు. కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్కాపురం
• మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం


పెద్దారవీడు: మాట్లాడుతున్న తెదేపా నేత ఎరిక్షన్‌బాబు, పాల్గొన్న అధికారులు, నాయకులు


కంభంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు, అధికారులు

అర్హులందరికీ పింఛన్లు అందించడమే లక్ష్యం

పెద్దారవీడు, కంభం, రాచర్ల, పొదిలి, యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛన్లు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టులోని ముంపు గ్రామమైన గుండంచర్లలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తామన్నారు. త్వరలోనే వెలిగొండ నిర్వాసితులకు నష్టపరిహారం అందించి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో తెదేపా కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, నాయకులు ఇండ్లా రామకృష్ణారెడ్డి, సుబ్బరామిరెడ్డి, గొట్టం శ్రీనివాసరెడ్డి, తిరుపతిరెడ్డి, నాగేశ్వరరావు, లింగాల అబ్రహాం తదితరులు పాల్గొన్నారు. ● కంభం, రాచర్ల మండలాల్లో సామాజిక పింఛన్లను అధికారులు, కూటమి పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి మంగళవారం పంపిణీ చేశారు. ● పొదిలి నగర పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 98 శాతం పంపిణీ చేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ● యర్రగొండపాలెం మండలంలో మంగళవారం ఉదయం నుంచే పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి కొన్ని చోట్ల రాత్రి 8 గంటల వరకు కొనసాగించారు.

ఇసుక సరఫరా విధానం సులభతరం చేయాలి

యర్రగొండపాలెం పట్టణం: ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కే పీరా డిమాండ్ చేశారు. ఈ మేరకు భవన నిర్మాణ కార్మికులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన ఉచిత విధానంలో ఇసుక టన్ను రూ.2వేలు పడుతోందన్నారు. ఇసుక సరఫరాను సులభతరం చేసి స్టాకు పాయింట్లు లేకుండా నేరుగా రీచ్‌లోనే లోడు చేసే విధానాన్ని ప్రవేశపెట్టి కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సీనియర్ అసిస్టెంట్ ప్రసాదుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు బాణాల రామయ్య, అన్వర్‌బాషా, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

హిందువులను మనోవేదనకు గురిచేసిన వైకాపా

బేస్తవారపేట, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిందని జనసేన జిల్లా కార్యదర్శి లంకా నరసింహారావు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చేపట్టిన దీక్షకు మద్దతుగా మంగళవారం మండలంలో ఓం నమో నారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంతో హిందువులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని తెలిపారు. అనంతరం పంచాయతీలోని పలు వీధుల్లో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, విశ్వనాథ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ● కంభం (రాచర్ల): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు రాచర్ల మండలం పాలకవీడు ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. 51 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాయుడు, తిరుమలశెట్టి వెంకట్రావు, వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చా నాయకులు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● కంభం (రాచర్ల): పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతూ జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పుట్టా బాలకృష్ణ ఆధ్వర్యంలో రాచర్ల మండలం అనుములపల్లి వద్ద రామాలయం వద్ద ఓం నమో నారాయణ మంత్ర పఠనం చేశారు.


బేస్తవారపేట: ప్రదర్శన నిర్వహిస్తున్న జనసేన నేత లంకా నరసింహారావు, నాయకులు,

వృద్ధుల అనుభవాలే మన పురోగతికి ఆధారం

గిద్దలూరు పట్టణం, పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: వృద్ధుల అనుభవాలే మన పురోగతికి ఆధారమని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షకుడు డా.సూరిబాబు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ● పెద్దదోర్నాలలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వృద్ధులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

దసరా ఉత్సవాల గోడప్రతుల విడుదల

యర్రగొండపాలెం పట్టణం: త్రిపురాంతకం శ్రీబాల త్రిపుర సుందరి దేవి ఆలయంలో ఈ నెల 3న నుంచి జరగనున్న దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల గోడ ప్రతులను తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో త్రిపురంతకం తెదేపా నాయకులు ఆళ్ల నాసర్‌రెడ్డి, దేవినేని చలమయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత.. అందరి బాధ్యత

● ఈనాడు, ఈటీవీ పిలుపు మేరకు స్వచ్ఛతకు నడుం బిగించిన వాసవి విద్యార్థులు


వ్యర్థాలు సేకరించి బుట్టల్లో నింపుతున్న విద్యార్థులు

కంభం, గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే:

పరిసరాల పరిశుభ్రత.. అందరి బాధ్యతని వాసవి డిగ్రీ కళాశాల విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈనాడు, ఈటీవీ పిలుపు మేరకు కంభంలోని వాసవి డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, విద్యార్థులు మంగళవారం కంభం చెరువు కట్టపై స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ బాలికలు, బాలురతో పాటు, విద్యార్థులు కట్ట పైకి వెళ్లారు. దానిపై ఉన్న చెత్తచెదారాన్ని చెత్త డబ్బాల సాయంతో ఏరివేశారు. వ్యర్థాలను కుండిల్లో పోసి నిప్పు పెట్టి కాల్చి వేశారు. దాంతో చెరువు కట్ట ప్రాంతం శుభ్రమైంది. దీనిపై పర్యాటకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● గిద్దలూరు నగర పంచాయతీలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పట్టణంలో స్వచ్ఛత హీ సేవా ర్యాలీ చేపట్టారు.


చెరువు కట్టపై చెత్త సేకరిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

సామాజిక బాధ్యతగా భావించాలి..



పరిశుభ్రత కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నా, పూర్తిస్థాయిలో మార్పు రావడం లేదు. అపరిశుభ్రతతోనే ప్రజలు పలు రకాల వ్యాధులకు గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువు కట్టపై స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఏర్పాటు చేయడం హర్షణీయం. పంచాయతీల్లోనూ అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేయాలి. – షేక్ నదీర్, ఎన్‌సీసీ విద్యార్థి, వాసవి కళాశాల

ఎంతో ఆనందం కలిగిస్తుంది.



వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం బాధ్యతగా అందరూ భావించాలి. అప్పుడే మెరుగైన సమాజం సాధ్యం పడుతుంది. ఎక్కడ పడితే అక్కడ చెత్తచెదారం వేయకూడదనే అవగాహన ప్రతి ఒక్కరూ పెంచుకోవాలి. ఎన్‌సీసీలో భాగంగా ఇలాంటివి చేయడం ఎంతో ఆనందం కలిగిస్తుంది.– నల్లబోతుల భరత్‌కుమార్, ఎన్‌సీసీ, డిగ్రీ విద్యార్థి

మంచి పనికి అందరూ ముందుకురావాలి..



స్వచ్ఛతా హీ సేవా చాలా మంచి కార్యక్రమం. గాంధీజీ కలలను నిజం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఇలాంటి కార్యక్రమాలు తరచూ చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. అందరికీ అవగాహన కలుగుతుంది. నాకు తెలిసిన వారందరికి స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తా.
– గురవయ్య, ఎన్‌సీసీ విద్యార్థి

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

తర్లుపాడు, పొదిలి, పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: మండలంలోని తాడివారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అజీమ్ బాషా తెలిపారు. విజేతలుగా నిలిచిన విష్ణు వెంగలరెడ్డి, శివశంకర్, కార్తీక్, హైమావతి, భవాని, భానుశ్రీ, స్నేహలత, ప్రణతి, లక్ష్మీ, అజయ్, కల్యాణ్ రామ్, బాబు, మహేశ్ చంద్ర, శివకాశీరామ్ తదితరులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. ● ఒంగోలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి టైక్వాండో పోటీల్లో పొదిలి విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో షేక్ షాజియా, పి.శ్రీవాత్సల్య, అండర్-17 బాలికల విభాగంలో షేక్ సుమయా ఫాతిమాలు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. ● పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.నాగరాజు రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ నారాయణరెడ్డి తెలిపారు.


తర్లుపాడు: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

ఘనంగా ముందస్తు దసరా వేడుకలు

మార్కాపురం పట్టణం, పొదిలి, కంభం: మార్కాపురం పట్టణంలోని భాష్యం పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి, మహిషాసురమర్దిని అలంకరణల్లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ● పొదిలిలోని శ్రీరాఘవేంద్ర ఉన్నత పాఠశాల, స్మార్ట్ కిడ్స్ పాఠశాలల్లో కార్యక్రమాల్లో దసర నవరాత్రుల సందర్భంగా దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు వివిధ రకాల అలంకరణల్లో సంబరాల్లో పాల్గొన్నారు. ● కంభంలోని వాసవి ఉన్నత పాఠశాల ఆవరణలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థినులు అమ్మవారి పాటలకు నృత్యాలు చేశారు.


కంభం: వాసవీ ఉన్నత పాఠశాలలో నవదుర్గా అలంకరణలో విద్యార్థినులు


మార్కాపురంలో..


పొదిలిలోని శ్రీరాఘవేంద్ర పాఠశాలలో సంబరాల్లో..

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
పొదిలి : 8008550360
కంభం : 8008574141

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని రహదారిపై మురుగు నిలిచి ఉంది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – రామయ్య, స్థానికుడు
సమాధానం: పరిశీలించి, రహదారిపై నిలిచిన మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసులు, ఈవోఆర్డీ

మార్కాపురం, న్యూస్‌టుడే:

?: మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా మురుగు నీరు కదలడం లేదు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
– నారాయణరెడ్డి, బోడపాడు
✓: సర్పంచితో చర్చించి సమస్య పరిష్కరిస్తాం. – దిలీప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బోడపాడు

నూతన స్తంభం ఏర్పాటు

స్పందనకు వందనం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు- కొమరోలు రహదారిలోని ఆంజనేయస్వామి గుడి వద్ద విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. ఈ సమస్యపై ఈనాడులో గత సోమవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన గిద్దలూరు ఏఈ నారాయణరెడ్డి గుత్తేదారుడితో మాట్లాడి మంగళవారం నూతన విద్యుత్తు స్తంభాన్ని ఏర్పాటు చేయించారు.

మంత్రి లోకేశ్ 'ప్రజా దర్బార్'కు వినతుల వెల్లువ

తాడేపల్లి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరించారు. అందరినీ మంత్రి ఆప్యాయంగా పలకరించడంతోపాటు సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. ప్రకాశం జిల్లా కంభం మండలం కుందలాపురంలో తమ కుటుంబానికి చెందిన 1.9 ఎకరాల పట్టాభూమిని గత వైకాపా ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో గ్రామ కంఠంగా నమోదు చేశారని మార్కాపురానికి చెందిన రాచకుండా లక్ష్మీదేవి వినతులు ఇచ్చారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పొదిలి గ్రామీణం: పొదిలి, దర్శి రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న బుచ్చన్నపాలెం గ్రామానికి చెందిన కోమటిగుంట సుబ్బారావు జులై 6న ప్రమాదవశాత్తు భవనం పై నుంచి కిందపడి మృతి చెందారు. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్ యాజమాన్యం మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 4 లక్షలు మంగళవారం అందజేశారు. రాష్ట్ర తెదేపా కార్యదర్శి భాస్కర్, ఆర్‌ఎంపీ వైద్యులు వెంకటరెడ్డి, నేతలు పాల్గొన్నారు.


మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న తెదేపా నేతలు

పాఠశాలకు నీటి ట్యాంకు అందజేత

కంభం (రాచర్ల): రాచర్ల మండలం చోల్లవీడు ఉన్నత పాఠశాలకు విశ్రాంత ఎంఈవో ముత్యాల సుబ్బారావు కుమారుడు మనోజ్‌కుమార్ నీటి ట్యాంకు అందజేశారు. గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు రూ. 8 వేలు, రూ. 6 వేలు, రూ. 4 వేలు అందించారు.

పంట చేల్లో సాంకేతిక పాఠాలు

❑ విస్తృతంగా పొలం పిలుస్తోంది

బేస్తవారపేట, న్యూస్‌టుడే:

మూస పద్ధతులకు స్వస్తి పలికి నూతన విధానాలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న మరో 14 శాఖల సేవలను సద్వినియోగం చేసుకునేలా అందరి భాగస్వామ్యంతో ముందడుగు వేస్తోంది. పెట్టుబడి తగ్గించి పంట దిగుబడి, ఆదాయం పెంచడమే ధ్యేయంగా వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు పొలం బాట పట్టారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఇప్పటికే పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మొదలయ్యాయి.

వారంలో రెండు రోజులు..

ప్రతి వారంలో రెండు రోజులపాటు (మంగళ, బుధవారాలు) అధికారులు, సిబ్బంది పొలంబాట పట్టాలని నిర్ణయించారు. రోజుకు రెండు ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ కార్యక్రమానికి వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక, మార్కెటింగ్, ఆత్మ, డెయిరీ, మత్స్య, తదితర విభాగాల అధికారులు నిర్వహిస్తారు. ఉదయం ఓ గ్రామంలో 8:30 నుంచి 10 గంటల వరకు క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన చేస్తారు. 10 నుంచి 12 గంటల వరకు నిపుణులు, శాస్త్రవేత్తలను రప్పించి అన్నదాతలతో గ్రామ సభ ఏర్పాటు చేస్తారు. అనంతరం మరో గ్రామంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పంటలను పరిశీలించి సాయంత్రం 5:30 వరకు సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్నదాతల సందేహాలను నివృత్తి చేస్తారు.

లోపాలు గుర్తించి.. లాభాల బాట పట్టించి..

సాగు చేసిన పంటలను పరిశీలించి చీడపీడలను సకాలంలో గుర్తించనున్నారు. దిగుబడి తగ్గడానికి గల కారణాలు విశ్లేషించి వెంటనే పెంపునకు చర్యలు తీసుకుంటారు. తుంపర, బిందు సేద్యం విధానంలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా పంట పెట్టుబడులకు రుణాల మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడం, డ్రోన్ టెక్నాలజీ, విత్తనశుద్ధి తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.


పందిళ్లపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏవో మెర్సీ

ప్రణాళిక ప్రకారం ముందుకు..

గిద్దలూరు వ్యవసాయశాఖ సబ్‌డివిజన్‌లో 62 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఖరీఫ్‌లో నాలుగు, రబీలో నాలుగు నెలలు ఈ కార్యక్రమం చేపడతారు. ఇప్పటికే ఏ రోజున ఏఏ గ్రామాల్లో కార్యక్రమం చేపట్టాలనే విషయాలపై వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో రైతులందరూ భాగస్వాములు కావాలని ముందస్తు సమాచారం ఇస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఆధునిక సేద్య విధానాలను అన్నదాతలకు చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టింది. రైతులందరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలి. – డి.బాలాజీ నాయక్, గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పొదిలి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యాయవాదుల చట్టం సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ మంగళవారం పొదిలిలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకిషోర్, షేక్ షబ్బీర్, ఉపాధ్యక్షులు సుజాత, సంయుక్త కార్యదర్శి జి.పెద్దయ్య, న్యాయవాదులు రామ్మోహనరావు, బి.వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, జిలాని, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రం..

ఒంగోలు గ్రామీణం: కేంద్ర సహకార బ్యాంక్ మార్కాపురం బ్రాంచి మేనేజర్ టి.శ్రీనివాసులు మృతి చెందడంతో... కారుణ్య నియామకం కింద ఆయన కుమార్తె టి.భాషితకు స్టాఫ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ అవకాశం కల్పించారు. ఆ మేరకు జేసీ గోపాలకృష్ణ... మంగళవారం నియామక పత్రం అందజేశారు. పీడీసీసీ బ్యాంక్ సీఈవో ఈదా కోటిరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మార్కాపురం పట్టణం: రక్తదానం ప్రాణదానంతో సమానమని మాజీ మంత్రి సురేష్ అన్నారు. జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ అభ్యర్థులు రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆపదల్లో ఉన్న వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మార్కాపురం: బహుమతులు, ప్రశంసా పత్రాలతో గెలుపొందిన విద్యార్థులు

ఉత్సాహంగా చెకుముకి ప్రతిభా పోటీలు

న్యూస్‌టుడే బృందం: మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని వివిధ మండలాల్లో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేవీవీ నాయకులు మాట్లాడుతూ... విద్యార్థులందరూ సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. సమాజాభివృద్ధికి శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంతో ముఖ్యమని చెప్పారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఈ నెల 27న చీమకుర్తిలో జరిగే జిల్లాస్థాయి పరీక్షకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నేత మాలకొండారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం

కంభం, న్యూస్‌టుడే: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై ఇటీవల ఉన్నతాధికారుల నుంచి ప్రశంసా పత్రం అందుకున్న మండలంలోని రావిపాడు (సీఆర్) ఉర్దూ ఉపాధ్యాయురాలు సయ్యద్ యాస్మిన్ భానును మంగళవారం ఎంఈవోలు మాల్యాద్రి, శార్వాణి, కాంప్లెక్స్ ఛైర్మన్ రామకృష్ణ ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను వారు కొనియాడారు.

ఆక్రమణల తొలగింపు ప్రారంభం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి కొత్తూరులో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు పనులు అధికారులు ప్రారంభించారు. రహదారికి ఇరువైపులా గతంలో ఉన్న పాత కాలువపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాల సంబంధించి సుమారు 15 రోజుల కిందట అధికారులు నోటీసులు ఇచ్చారు. కొంతమంది స్వచ్ఛందంగా రేకులు తొలగించుకోగా.. చాలామంది తొలగించలేదు. దీంతో అధికారులే ప్రొక్లయిన్‌తో ఆక్రమణలను తొలగించారు. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ ముందు వైపు నుంచి పుల్లరపేట వరకు ఉన్న పెద్దకాలువ పూడిపోయింది. వర్షం పడిన ప్రతిసారి నీరు రోడ్లపైకి చేరుతోంది. ఈ విషయమై పది రోజుల క్రితం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పందించి పట్టణంలో ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు. ఆ మేరకు అధికారులు చర్యకు ఉపక్రమించారు.


ఆర్టీసీ బస్టాండ్ ముందు యంత్రం సాయంతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

మార్కాపురం: ప్రతి ఒక్కరూ న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ న్యాయ సహాయకుడు న్యాయవాది పైడిమర్రి రామచంద్ర అన్నారు. మార్కాపురం పట్టణంలోని మంగళవారం ఎస్టీకాలనీలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వృద్ధులకు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పల్లెలు.. మురుగు నిలయాలు

ఈ చిత్రంలోని కనిపించే నీటి మడుగు పాపనేనిపల్లి గ్రామంలోని ప్రధాన రహదారి సీసీ రోడ్డుపై నిలిచిన మురుగు. మూడు నెలల కిందట ఈ రోడ్డు పనులు చేశారు. గతంలో ఇక్కడ మురుగు నిలుస్తోందని రోడ్డు వేస్తే కొత్త రోడ్డుపై కూడా అదే సమస్య తలెత్తుతోంది. ముక్కు మూసుకుని వాహనదారులు రహదారిపై రాకపోకలు సాగిస్తున్నారు.. రాత్రుల్లో మురుగుతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మురుగు పక్కనే ఉన్న ఖాళీ స్థలం ఉంది. అందులోకి మురుగును పంపించే సమస్య తీర్చే అవకాశం ఉన్నా.. ఆ దిశగా అడుగులు పడటం లేదని స్థానికులు వాపోతున్నారు.


బురదమయంగా పాపినేనిపల్లి రహదారి

అర్ధవీడు, న్యూస్‌టుడే:

పల్లెల్లో పరిశుభ్రత కనుమరుగవుతోంది. వీధులన్నీ మురికివాడలను తలపిస్తున్నాయి. అర్ధవీడు మండల పరిధిలోని 15 పంచాయతీలు 32 గ్రామాలు ఉన్నాయి. సుమారు 16 గ్రామాల్లో పారిశుద్ధ్యం సమస్య తీవ్రంగా ఉంది. బొల్లుపల్లి, పాపినేనిపల్లి, అంకభూపాలెం, మాగుటూరు, నాగులవరం, మొహిద్దీన్‌పురం, కొత్తూరు తదితర పల్లెల్లో సీసీ రోడ్లపై మురుగు చేరింది. అవి దోమలకు ఆవాసంగా మారుతూ వ్యాధులు వ్యాపి చేస్తున్నాయి. చిన్నపాటి పనులు చేస్తే తొలగే సమస్యను అధికారులు నెలల తరబడి చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న మురుగు మాగుటూరు గ్రామంలోని రాముల వారి గుడి దగ్గరది. చిన్న పాటి వర్షానికి ఇక్కడ నీరు చేరి మురుగవుతుంది. తొలగించాలంటూ పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మాగుటూరులో ఇలా..

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి



స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఏబీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధికారులు తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా.. కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

దొనకొండ, న్యూస్‌టుడే:

సమస్య: దొనకొండ పంచాయతీలోని బాదాపురం ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్లు లేకపోవడంతో వర్షాలు పడిన పుడు ఇళ్ల ముందే నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి.

–బాబు, బాదాపురం ఎస్సీకాలనీ

సమాధానం: సిమెంట్ రోడ్లు వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. ఆ కాలనీలో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. మురుగు ఉన్న చోట బ్లీచింగ్ చల్లిస్తాం.

– డేవిడ్, పంచాయతీ కార్యదర్శి

పీసీపల్లి, న్యూస్‌టుడే:



సమస్య: మండలంలోని ముద్దపాడు పంచాయతీ పరిధిలోని కొత్త ముద్దపాడు వెళ్లే రహదారిలో గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలంటే మరింత ఇబ్బందికరంగా ఉంది. –స్థానికులు

సమాధానం: సర్పంచితో చర్చించి గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. –కిరణ్, పంచాయతీ కార్యదర్శి

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

టంగుటూరు,(సూరారెడ్డిపాలెం), న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని సూరారెడ్డిపాలెం, వల్లూరు గ్రామాల్లో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పింఛను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు చేరడానికి అయిదేళ్లు పట్టిందన్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నజ్యోతి, సర్పంచి నర్రా శైలుషా, తెదేపా మండల అధ్యక్షుడు కామని విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సచివాలయ సిబ్బంది ఆలస్యంగా రావడంపై అధికారులు వారిని మందలించారు. ❖ కొండపి గ్రామీణం: ఒక్కరోజే 90 శాతం మందికి పింఛన్లు అందజేసినట్లు హౌసింగ్ పీడీ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. కొండపిలో గృహనిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. ❖ దర్శి: తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి 16వ వార్డు, మండలంలోని చెర్వుకొమ్ముపాలెంలో పింఛన్లు పంపిణీ చేశారు. డా. లలిత్‌సాగర్, నగర పంచాయతీ ఛైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేష్, ఎంపీడీవో కృష్ణమూర్తి పాల్గొన్నారు. ❖ ముండ్లమూరు: పెద్ద ఉల్లగల్లులో పింఛన్ల పంపిణీలో లక్ష్మి పాల్గొన్నారు. గ్రామ సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. ఎంపీడీవో జనార్దన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ❖ తాళ్లూరు: మండలంలో 6,249 మందికిగాను 6,038 మందికి పింఛన్లు అందజేసినట్లు ఈవోఆర్డీ కేజీఎస్. రాజు తెలిపారు. ❖ కనిగిరి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో తెదేపా వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వి.వి.మనోహరరావు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ❖ పామూరు, సి.ఎస్.పురం: పామూరు, సి.ఎస్.పురం మండలాల్లో ఉదయం ఆరు గంటలకే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి డబ్బులు అందజేశారు. ఎంపీడీవో బి.సురేష్ పర్యవేక్షించారు. పామూరు మండల తెదేపా అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు. ❖ సింగరాయకొండ గ్రామీణం: మండలంలోని మూలగుంటపాడులో ఎంపీడీవో జయమణి ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీలో జిల్లా తెదేపా న్యాయవిభాగం అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి రామారావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ❖ హనుమంతునిపాడు: మండలంలో 4,135 మందికి గాను 94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఎం.రంగసుబ్బారాయుడు తెలిపారు. ఉదయం కొంతసేపు సర్వర్ మొరాయించినా తర్వాత ఎటువంటి ఇబ్బంది రాలేదని సచివాలయ సిబ్బంది తెలిపారు.



సూరారెడ్డిపాలెంలో వృద్ధుడికి పింఛను సొమ్ము అందిస్తున్న మంత్రి స్వామి, చిత్రంలో సర్పంచి శైలుషా తదితరులు

రైతు కుటుంబానికి రూ.7 లక్షల చెక్కు అందజేత



చెర్వుకొమ్ముపాలెంలో దివ్యాంగుడికి నగదు అందజేస్తున్న గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న నాయకులు

దర్శి: నగరపంచాయతీ పరిధిలోని శివరాజ్‌నగర్‌లో పలి వెంకటరెడ్డి అనే రైతు అప్పుల బాధతో మృతి చెందారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7 లక్షల చెక్కును ఆయన భార్య సుబ్బరత్తమ్మ, ఇతర కుటుంబ సభ్యులకు మంగళవారం గొట్టిపాటి లక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ బాలాజీనాయక్, ఏవో బాలకృష్ణానాయక్, ఇతర అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతే ధ్యేయం.. సేవా మార్గం

❖ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని చాటిన ఏబీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

❖ 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో చెత్త, పిచ్చిమొక్కల తొలగింపు

న్యూస్‌టుడే, కనిగిరి

ఆరోగ్యకరమైన సమాజం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఏబీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అభిప్రాయపడ్డారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మంగళవారం వారు భాగస్వాములయ్యారు. పట్టణంలోని ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్, ఉప ఖజానా, వెలుగు, తహసీల్దార్, పోలీస్ కార్యాలయాల ప్రాంగణాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎవో కరువది బాలాజీవిశ్వనాథ్, ఏబీఆర్ విద్యాసంస్థల సంస్థల అధినేత ఆవుల బసిరెడ్డి, ప్రిన్సిపల్ దేవిరెడ్డి లింగారెడ్డి, డీటీ రమేష్, ఎంఈవో డి.రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, జేవీవీ నాయకుడు షేక్ గయాజ్‌బాషా, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి తిరుపతిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. పారిశుద్ధ్యం జీవితంలో భాగం కావాలని విద్యార్థులు చెప్పారు.

అందరికీ అవగాహన కల్పిస్తాం..



ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రం చేయడం ఎంతో ఆనందంగా ఉంది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. చెట్లు ఎక్కువగా పెంచితే నీడను ఇవ్వడమే కాకుండా వాటితో పరిశుభ్రమైన గాలి లభిస్తుంది. అందుకు ప్రతివారు చెట్లను పెంచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పిస్తాం.

–ప్రేమ్, వెంకటేశ్వర్లు, వెంకటేష్, ఇంజినీరింగ్ విద్యార్థులు

దోమల బెడద తగ్గుతుంది..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల బెడద తగ్గుతుంది. పలు వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోగలం. పట్టణాలు, పల్లెల్లో పారిశుద్ధ్య పనులు చేసి వ్యాధులు రాకుండా నివారించవచ్చు.

–కౌసల్య, రమ్య, చెన్నకృష్ణ, విద్యార్థినులు

కాలుష్య నివారణపై తెలియజేస్తాం..



భావి తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం. ఈనాడు-ఈటీవీ చేపట్టిన ఈ మంచి కార్యక్రమంలో మేము పాల్గొన్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. మన చుట్టుపక్కల వారికి వాతావరణ కాలుష్యం, నివారణ చర్యల గురించి తెలిపి వారు పరిసరాల పరిశుభ్రత పాటించేలా చేస్తాం.

–హర్షవర్ధన్, ఈశ్వర్, ప్రశాంత్

విధిగా మొక్కలు నాటాలి



ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అదే విధంగా వ్యక్తిగత పరిశుభ్రత కూడా అవసరం. దీంతో పాటు ఇంటి ఆవరణ, ఇతర ప్రాంతాల్లో ఒక మొక్క నాటి పెంచితే పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుంది. స్వచ్ఛతతోపాటు మొక్కలు నాటేలా అందరినీ ప్రోత్సహించాలి. చెట్లను మనం రక్షిస్తేనే అవి మానవాళిని కాపాడతాయని గుర్తించాలి.

–గణేష్, మధు, శ్రీనాథ్, ఇంజినీరింగ్ విద్యార్థులు



ఎర్ర చెరువు గట్టుపై పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

దర్శి పొట్టి శ్రీరాములు జూనియర్ కళాశాల విద్యార్థులు..

దర్శి, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం దర్శిలోని పొట్టి శ్రీరాములు జూనియర్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి ముందడుగు వేశారు. మంగళవారం స్థానిక పల్లెవనం పార్కు పరిసరాలను శుభ్రం చేశారు. కురిచేడు రోడ్డులోని ఎన్టీఆర్ పల్లెవనం పార్కుకు సమీపంలోని ఎర్ర చెరువు గట్టు అపరిశుభ్రంగా మారింది. దీనిపై నిత్యం అనేకమంది ఉదయం నడక సాగిస్తుంటారు. ఇక్కడ ఓపెన్ జిమ్ కూడా ఉంది. నిర్వహణ లోపంతో ఈ ప్రాంతం తీవ్ర అపరిశుభ్రంగా మారింది. గట్టుపై పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి చెత్తా, చెదారం ఏరివేశారు. సుమారు 40 మంది ఇంటర్ విద్యార్థులు, కళాశాల డైరెక్టర్ పెద్దిరాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణతో తెగుళ్ల నివారణ

న్యూస్‌టుడే, బృందం: కనిగిరి, దర్శి, కొండపి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో వ్యవసాయ, ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. మిర్చి, కంది, పత్తి ఇతర పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పంటలను ఆశించే తెగుళ్లను సమగ్ర సస్యరక్షణతో నివారించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పీసీపల్లి మండలం గుంటుపల్లిలో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని వివరించారు. మామిడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జరుగుమల్లిలో ఉద్యానశాఖ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రబాబు, ఏడీఏలు వెంకట రమణ, నిర్మలా కుమారి, ఏవోలు మధుబాబు, విజయ్‌కుమార్, యుగంధర్ రెడ్డి, బి.ప్రసాదరావు, షారుఖ్, రమణ, జిల్లా సాంకేతిక ఏవో శ్రీనివాస్ నాయక్, వనరుల కేంద్రం ఏవో శైలజ, పశు వైద్యాధికారులు రాంబాబు, శ్రావణి, హెచ్‌వోలు ప్రత్యూష, అంజలి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



కొండపి గ్రామీణం: పెద్దకండ్లగుంటలో కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నిర్మలా కుమారి తదితరులు

'ఓటు బ్యాంకు ప్రయత్నాలు తగవు'

పామూరు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని మండల మాలల సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జొన్నలగడ్డ గోవిందయ్య అన్నారు. మండలంలోని ఇనిమెర్లలోని మాల పల్లెలో ఆ సంఘం బాధ్యులు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాలకులు ఎస్సీలను విభజించి ఒక వర్గం వారిని ఓటు బ్యాంకుగా మార్చుకోవాలనే ప్రయత్నాన్ని మానుకోవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని, పేద విద్యార్థులకు సంఘం అండగా ఉంటుందని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన పోరాటాలు, త్యాగము, ప్రస్తుతం చేయాల్సిన బాధ్యతలు గురించి కె.రవీంద్రనాథ్ వివరించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు కె.బాలు, వి.రాజశేఖర్, ఆర్.పోతురాజు, డి.కార్తీక్, స్థానికులు పాల్గొన్నారు.

స.హ. చట్టంతో పారదర్శక పాలన

పామూరు: సమాచార హక్కు చట్టంతో పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని కనిగిరి ఏడీఏ ఎగ్గోని వెంకటరమణ, తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. సమాచారం నిమిత్తం వచ్చే దరఖాస్తులకు నిర్దేశిత గడువులోగా వివరాలను అందజేయాలని చెప్పారు. ఎంపీడీవో బి.సురేష్, ఎంఈవో జి.కరుణకుమారి, ఏవో కె.రాధ, ఉద్యాన అధికారిణి కె.కుసుమకుమారి, ఉప తహసీల్దార్ సీహెచ్.పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల్లో బియ్యం పంపిణీ తనిఖీ

రజానగరం(తాళ్లూరు): కార్డులందరికీ తప్పకుండా బియ్యం అందజేయకుంటే చర్యలు తప్పవని తహసీల్దారు కె.నాగలక్ష్మి స్పష్టం చేశారు. మండలంలోని రజానగరం, మాధవరం గ్రామాల్లో మంగళవారం ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీని ఆమె తనిఖీ చేశారు.

పోటీ పరీక్షలతో విజ్ఞానం పెంపు

పామూరు, సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీ పరీక్షలు రాయడం వల్ల వారిలో విజ్ఞానం పెరుగుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ టి.చెన్నకృష్ణ, ఎంఈవో జి.కరుణకుమారి అన్నారు. పామూరు, సి.ఎస్.పురంలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలు జరిగాయి. మండల స్థాయిలో విజేతలకు నవోదయ మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు షేక్ గౌస సహకారంతో బహుమతులను ఎంఈవోలు జగన్నాథం ప్రసాదరావు, రాజాల కొండారెడ్డిలు పంపిణీచేశారు. ❖ హనుమంతునిపాడు: మండలంలోని గొల్లపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థినులు విష్ణుశరణ్య, లక్ష్మీనేహ్య, రిషితలు జేవీవీ పరీక్షలో ప్రతిభ చాటారు. ❖ దర్శి, న్యూస్‌టుడే: విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉండాలని ఎంఈవో రఘురామయ్య సూచించారు. జేవీవీ ఆధ్వర్యంలో దర్శి, కురిచేడు మండలాల విద్యార్థులకు స్థానిక గౌతమీ పాఠశాలలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

❖ తూర్పుగంగవరం(తాళ్లూరు): తూర్పుగంగవరం జడ్పీ ఉన్నత పాఠశాల్లో చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. లక్కవరం జడ్పీ ఉన్నత, తూర్పుగంగవరం గీతాంజలి ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రశంసా పత్రాలతోపాటు బహుమతులను అందజేశారు.



పామూరు: ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెన్నకృష్ణ, అధికారులు



ఎస్సై చొరవ.. గుంతల పూడ్చివేత

వెలిగండ్ల మండలం మొగుళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. దీంతో నిత్యం ప్రమాదాలు జరుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన ఎస్సై మధుసూదన్‌రావు స్థానికుల సహాయం తీసుకున్నారు. కొంత తన సొంత నిధులు వెచ్చించి మంగళవారం యంత్రాల సాయంతో పదిచోట్ల పెద్ద గుంతలను పూడ్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో తన వంతుగా బాధ్యత నిర్వర్తించడం ఆనందంగా ఉందన్నారు. –న్యూస్‌టుడే, వెలిగండ్ల

విద్యుత్తు ఈఈ బాధ్యతల స్వీకరణ

కనిగిరి: కనిగిరి విద్యుత్తు ఈఈగా వీరయ్య మంగళవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన హరిబాబు ఒంగోలుకు బదిలీపై వెళ్లారు. నెల్లూరు జిల్లా కందుకూరులో పనిచేస్తూ వీరయ్య బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు సమస్యలు వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం తెలుగునాడు కార్మిక సంఘం నాయకులు పద్మనాభరెడ్డి, వరప్రసాద్ తదితరులు ఆయనను కలిసి అభినందించారు.

◗ ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఖాదర్‌బీ..

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సి.ఎస్.పురం ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా మండల పరిషత్తు కార్యాలయ పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాదర్‌బీ నియమితులయ్యారు. ఈ మేరకు జడ్పీ సీఈవో బి.చిరంజీవి ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పది రోజుల నుంచి ఇక్కడ ఎంపీడీవో లేకపోవడంతో ఇన్‌ఛార్జిగా నియామకం చేశారు.

దసరా ముందస్తు సంబరం



నవదుర్గల అలంకరణలో విద్యార్థినులు

పామూరు, న్యూస్‌టుడే: పామూరులోని సెయింట్ మార్క్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా వేడుకలను నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయం గురించి జరుపుకొనే పండుగ దసరా అని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థినులు మహిషాసురమర్ధిని, నవదుర్గల అలంకరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ◗ కనిగిరి: మండలంలోని లింగారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలు జరిగాయి. విద్యార్థులు కోలాటం ప్రదర్శించారు. బతుకమ్మను చేసి పూజించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.భ్రమరాంబ, ఉపాధ్యాయుడు నరసింహం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జంప్ రోప్ పోటీల్లో కాంస్య పతకం

కొండపి గ్రామీణం: కొండపిలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయినిలు సిరోమణి, జి.భార్గవిలు తెలిపారు. సెప్టెంబర్ 12-14 మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన అండర్-14 విభాగంలో అంగలకుర్తి కావ్య, కె.ప్రణతి పాల్గొన్నారు. కావ్య మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో వారిని అభినందించారు.

భూ సమస్యలకు త్వరలో పరిష్కారం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మండలంలోని రేగులచెలకలో భూముల ఆన్‌లైన్ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి తెలిపారు. స్థానిక రామాలయం వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రైతుల వినతులను తీసుకొని ఆ భూములు వారికి చెందినవా, లేదా అనే వివరాలను పరిశీలించారు. సంయుక్త కలెక్టర్‌కు నివేదికను పంపి త్వరలో భూములను ఆన్‌లైన్ చేస్తామని పేర్కొన్నారు.

పొగనారు.. సిద్ధమైన మడులు

న్యూస్‌టుడే, టంగుటూరు, జరుగుమల్లి

కొండపి నియోజకవర్గం పొగాకు పంటకు ప్రసిద్ధి. ఇక్కడ 70 శాతం మంది రైతులు ఈ పంట సాగుపైనే ఆధారపడుతున్నారు. మూడేళ్లుగా పొగాకు ధరలు అధికంగా పలుకుతుండడంతో రైతులు దీనిపై మొగ్గు చూపుతున్నారు. గత సీజన్‌కు సంబంధించి పొగాకు వేలం ప్రక్రియ ముగియక ముందే, వచ్చే సీజన్‌కు నారుమడులు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం బిడ్లు తయారు చేస్తుండగా.. కొన్నిచోట్ల నారు కోత దశకు చేరుకుంది.

❖ *గత ఏడాది సాగు ఇలా..*

నియోజకవర్గంలో టంగుటూరు, కొండపి మండలాల్లో పొగాకు బోర్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 6,827 మంది రైతులు, 5,734 బ్యారన్లు ఉన్నాయి. రెండు బోర్డుల పరిధిలో గత ఏడాది 200 హెక్టార్లలో నారుమడులను ఏర్పాటు చేశారు. గత సంవత్సరం ఆరంభంలో నారుమూట ధర రూ.1,000 ఉండగా.. క్రమేపీ పెరిగి రూ.3,500 వరకు పలికింది. అనంతరం వర్షాలకు అక్కడక్కడ దెబ్బతినడంతో ధరలు పతనమయ్యాయి. ప్రస్తుతం టంగుటూరు బోర్డు పరిధిలో 51, కొండపి పరిధిలో 151 హెక్టార్లలో నారుమళ్ల సాగు చేపట్టారు. ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని బోర్డు అధికారులు చెబుతున్నారు.

❖ పెరిగిన పెట్టుబడి వ్యయం..

పొగాకు సాగు ఖర్చులతో పాటు నారుమళ్ల సాగు కూడా ఏటికేడు పెరుగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు పెరిగిన డిమాండ్‌తో ధరలు అమాంతం పెరుగుతున్నాయి. దీంతో సాగు ఖర్చులు రెండింతలయ్యాయి. పొలం కౌలు, కూలీల ఖర్చులు, ఎరువుల ధరలు ఇష్టానుసారంగా పెరగడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీనికి తోడు పొగాకు ధరల నేపథ్యంలో రైతుల మధ్య పోటీ పెరిగింది. ఎకరా నారుదొడ్డి సాగుకు గతేడాది రూ.3 లక్షల వరకు ఖర్చయింది. ఈ ఏడాది అదనంగా మరో రూ.50 వేలు పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.



జరుగుమల్లి మండలం పైడిపాడు వద్ద నారు మడులను పరిశీలిస్తున్న పొగాకు బోర్డు అధికారులు

ఎకరా నారు దొడ్డి సాగుకు అయ్యే ఖర్చు (రూ.లలో)

భూమి కౌలు	దుక్కికి	బిడ్లు తయారీకి	ఎరువులు	వరిగడ్డికి	విత్తనాలు	కాపలాదారులకు	పురుగుమందులు	కలుపు, నారు తీతకు	మొత్తం ఖర్చు
40,000	10,000	16,000	11,750	20,000	5,400	1,20,000	10,000	1,50,000	రూ.3,83,150

కళాశాలలో స్వాగత సందడి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కనిగిరి, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకోవాలని కనిగిరి సీఐ షేక్ ఖాజావలి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాగత వేడుక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టుదలతో చదివితే విజయం సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ రమణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొణిజేడు చెరువుకి సాగర్ జలాలు ఇవ్వాలి

టంగుటూరు(కొణిజేడు), న్యూస్‌టుడే: మండలంలోని కొణిజేడులో చెరువుకి శాశ్వతంగా సాగర్ జలాలను అందించాలని స్థానిక సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ గ్రామ శాఖ సభలను మంగళవారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ఆంజనేయులు మాట్లాడుతూ.. అరకొరగా నీళ్లు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మోజెస్, టి.రాము, మీరాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి

కనిగిరి, న్యూస్‌టుడే: వృద్ధులను గౌరవించాలని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్‌చంద్ర పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని స్థానిక వృద్ధాశ్రమంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారికి రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్‌గఫార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

పామూరు: మండలంలోని తిరగలదిన్నె గ్రామంలోని దాబాలో అక్రమంగా నిల్వ ఉంచిన 22 మద్యం క్వార్టర్, 12 బీరు సీసాలను సీజ్ చేసినట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. నిందితుడు టి.రమణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ◗ వెలిగండ్ల: మండలంలోని మొగుళ్లూరులో పెద్ద కోటయ్య అనే వ్యక్తి నుంచి 32 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాధుసూదన్‌రావు తెలిపారు.

గృహ నిర్మాణ లబ్ధిదారుల బిల్లులు చెల్లిస్తాం



మాట్లాడుతున్న ఎంపీపీ ఉషారాణి

దొనకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఎంపీపీ ఉషారాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. గృహ నిర్మాణశాఖ ఏఈ హనుమంతరావు మాట్లాడుతూ.. 2014 నుంచి 2019 వరకు ఇళ్లు కట్టుకున్న వారికి అప్పట్లో బిల్లులు రాలేదని, మళ్లీ ఇప్పుడు వచ్చేందుకు ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలిపారు. 2019-24 మధ్య దశలవారీగా ఉన్న వారు పూర్తి చేసుకుంటే వెంటనే బిల్లులు ఇస్తామన్నారు. వెలుగు ఏపీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు రుణాలు ఇస్తున్నామని, వాటిని సకాలంలో బ్యాంకులకు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

3 నుంచి శ్రీగిరి బ్రహ్మోత్సవాలు

ఒంగోలు అంజయ్యరోడ్డు: శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సి.వి.కృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి తెలిపారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు కలశ స్థాపనతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు.

నేడు, రేపు గ్రామసభలు

ఒంగోలు గ్రామీణం: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లాలోని 729 గ్రామ పంచాయతీల్లో బుధ, గురువారాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు డీపీవో ఉషారాణి తెలిపారు. తొలిరోజు ఉపాధి హామీ పనుల ఎంపికకు సంబంధించి మర్రిపూడిలో జరగనున్న సభకు మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి హాజరుకానున్నారు. రెండో రోజు గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించనున్నారు.

న్యాయ సేవల సద్వినియోగంతో ప్రయోజనం



మాట్లాడుతున్న న్యాయవాది అరుణ

చీమకుర్తి, న్యూస్‌టుడే: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలతో పాటు న్యాయవ్యవస్థలోనూ సమాన అవకాశాలు ఉన్నాయని... వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ న్యాయవాది కాట్రగడ్డ అరుణ పేర్కొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ, మహిళా కమిషన్ ఆధ్వర్యంలో... చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో మరో న్యాయవాది ఎం.ధనలక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా మాట్లాడారు. పని ప్రాంతాల్లో జరుగుతున్న లైంగిక హింసపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాల నిరోధానికి అందరూ కృషి చేయాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీడీపీవో సుమాంజలి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థినులకు అభినందన



ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ కల్యాణి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఐఐటీ ముంబయికి చెందిన స్పోకెన్ ట్యుటోరియల్ సంస్థ ఆన్‌లైన్ విధానంలో... రెండు నెలల పాటు సీ ప్రోగ్రామింగ్‌లో శిక్షణ ఇచ్చింది. నగరంలోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 36 మంది విద్యార్థినులు ఇందులో పాల్గొన్నారు. శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షలో 33 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే మాదిరిగా పైథాన్ సర్టిఫికెట్ కోర్సులో 23 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది ఉత్తీర్ణత సాధించారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.కల్యాణి వారిని అభినందించారు. భవిష్యత్తులో మంచి ఉద్యోగాల సాధనకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. ఏవీ రాజ్యలక్ష్మి, జేకేసీ మెంటార్ జేఎన్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



మహిషాసుర మర్దిని నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



అమ్మవార్ల వేషధారణలో చిన్నారులు

నవదుర్గల సాక్షాత్కారం

పాఠశాలల్లో ముందస్తు దసరా సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు నవ దుర్గల వేషధారణల్లో అలరించారు. లాయర్‌పేట శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థినులు ప్రదర్శించిన మహిషాసుర మర్దిని నృత్యరూపకం ఆహూతులను ఆకట్టుకుంది. అజ్ఞానాంధకారాలు పారద్రోలడంతో పాటు... చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి నిర్వహించుకుంటామని ప్రిన్సిపల్ జోసెఫ్ తంబి పేర్కొన్నారు. ప్రతినిధులు శ్రీనివాసరావు, సువర్ణ, అనిల్, డీన్ బాలసుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపల్ శివపార్వతి, రజని, లక్ష్మి పండగ ప్రాధాన్యాన్ని వివరించారు. శ్రీరామ్ పాఠశాలల్లో ఛైర్మన్ ములకా రామిరెడ్డి, ప్రిన్సిపల్ రత్నకుమారి; చీమకుర్తి నారాయణ టెక్నోలో ఏజీఎం మన్నం శ్రీను, ప్రిన్సిపల్ వై.రామకృష్ణ; మద్దిరాలపాడు శ్రీ సూర్య విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ వెంకట రామిరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మిరెడ్డి, కిరణ్ చంద్ర ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు, చీమకుర్తి, నాగులుప్పలపాడు



శ్రీరామ్ పాఠశాలలో...



చీమకుర్తి: దేవతామూర్తుల అలంకరణలో...



మద్దిరాలపాడు: సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నీతి పద్యాల పుస్తకాల బహూకరణ

చీమకుర్తి, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పి.తులసినాథం నాయుడు... దేవరపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సుమారుగా రూ.40 వేల విలువైన నీతి పద్యాల పుస్తకాలను మంగళవారం బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కరశాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు జలాభిషేకం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మహనీయుల విగ్రహాలకు మంగళవారం జలాభిషేకం నిర్వహించారు. బాపూజీ కాంప్లెక్స్‌లోని జాతిపిత, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాలు, ఆ పరిసరాలను శుభ్రం చేశారు. మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఆరోగ్య అధికారి మనోహరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

కొత్తపట్నం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా కొత్తపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని మన్నం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసు విచారణ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఎస్సీ ఎస్టీ కేసు విషయమై ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అమ్మనబ్రోలులో మంగళవారం విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఓ మహిళ చికెన్ పకోడీ దుకాణం నిర్వహిస్తున్నారు. ఎస్సీ కాలనీకి చెందిన తలారి శ్రీకాంత్ పకోడీ తిన్నాక డబ్బులు చెల్లించే విషయంలో వివాదం తలెత్తింది. ఆ క్రమంలో తనను కులం పేరుతో ఆమె దూషించిందని శ్రీకాంత్ ఫిర్యాదు చేయడంతో ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. డీఎస్పీ వివరాలు సేకరించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

వీల్‌ఛైర్ అందజేత

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తికి చెందిన దివ్యాంగ విద్యార్థి జి.రేవంత్‌కుమార్‌కు జిల్లా సమగ్ర శిక్షాభియాన్ ద్వారా సమకూరిన వీల్ ఛైర్‌ను ఎంఈవో కె.శివాజీ మంగళవారం అందజేశారు.

స్వచ్ఛంద రక్తదాతలకు సత్కారం



రక్తదాతలతో రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా మంగళవారం... రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో పలుమార్లు రక్తదానం చేసిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీహర్షిణి విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదాతలైన కళాశాల డీన్ డి.ఆంజనేయులు, విద్యార్థి బి.మహేశ్వరరెడ్డి, ఆర్ఎస్ శ్రీనివాసరావును సత్కరించారు. సంస్థ ఛైర్మన్ పి.ప్రకాష్‌బాబు, కన్వీనర్ మంగళగిరి నరసింహారావు, సమన్వయకర్త నైనాల రామకృష్ణ, వైద్యాధికారి కృష్ణ, వైస్ ఛైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రక్తదానం చేశారు. కళాశాల ఛైర్మన్ సూర్యకళ్యాణచక్రవర్తి, ప్రిన్సిపల్ వైవీ హనుమంతరావు సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే విప్లవాత్మక మార్పులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంక్షేమ పాలనంటే ఎలా ఉంటుందో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతల్లో చూపుతున్నారని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగమూరులో మంగళవారం నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీలో ఆయన మాట్లాడారు. పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి ఒకటో తేదీనే ఠంచనుగా అందజేస్తున్నట్లు తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్ల ఏర్పాటుతో పాటు... వంద రోజుల్లోనే ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు వివరించారు. తెదేపా మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి నారాయణరావు, కంకణాల గోపి, కొండసింగు రాజు తదితరులు పాల్గొన్నారు.



మంగమూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



లబ్ధిదారుకు నగదు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, చిత్రంలో మేయర్ సుజాత

నగరంలో కలెక్టర్... : ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నగరంలోని రామనగర్, అన్నవరప్పాడు ప్రాంతాల్లో వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి కలెక్టర్ తమీమ్ అన్సారియా పింఛను మొత్తం అందజేశారు. మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ చింతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: మండలం పరిధిలో తొలి రోజే 96.50 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మద్దిపాడులో పంపిణీని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారిణి మంజుల పర్యవేక్షించారు. ఏడుగుండ్లపాడులో సర్పంచి శిల్పసౌందర్యతో కలిసి ఎంపీడీవో జ్యోతి పింఛన్లు అందజేశారు.

కారుణ్య నియామక పత్రం అందజేత

ఒంగోలు గ్రామీణం: కేంద్ర సహకార బ్యాంక్ మార్కాపురం బ్రాంచి మేనేజర్ టి.శ్రీనివాసులు మృతి చెందడంతో... కారుణ్య నియామకం కింద ఆయన కుమార్తె టి.భాషితకు స్టాఫ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ అవకాశం కల్పించారు. ఆ మేరకు జేసీ గోపాలకృష్ణ... మంగళవారం నియామక పత్రం అందజేశారు. పీడీసీసీ బ్యాంక్ సీఈవో కోటిరెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067 ఒంగోలు గ్రామీణం : 8008564455

ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766

ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:

?: పోతురాజు కాలువ దగ్గర గడ్డికయ్యలు (గోపాల్‌నగర్ ఎక్స్‌టెన్షన్) కాలనీలో రహదారులు, కాలువలు నిర్మించలేదు. మురుగంతా రోడ్డుపైనే పారుతుండడంతో ఇబ్బంది పడుతున్నాం. – వెంకట్రావు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి

✓: త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనుల్లో ఈ కాలనీకి ప్రాధాన్యమిచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – కె.వెంకటేశ్వరరావు, కమిషనర్

?: మస్తాన్ దర్గా సమీపంలోని కృష్ణమందిరం ఎదుట వీధి దీపం నాలుగు రోజులుగా వెలగడం లేదు. – వెంకటేశ్వర్లు, నగరవాసి

✓: బుధవారమే ఎల్ఈడీ విభాగం సిబ్బందిని పంపి దీపాన్ని బాగు చేయిస్తాం. – కె.వెంకటేశ్వరరావు, కమిషనర్

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే:

?: రాజాపానగల్ రోడ్డు పదో వీధిలో పైపులైను లీకై నీరు వృథాగా పోతోంది. సిబ్బందికి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. – తస్లీమా, స్థానిక మహిళ

✓: త్వరలోనే మరమ్మతులు చేపట్టి వృథాను అరికడతాం. – నరసింహారావు, పైపులైను పర్యవేక్షకుడు

స్తంభాలకు అల్లుకున్న పొదల తొలగింపు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: చంద్రపాలెంలో విద్యుత్తు స్తంభాలకు పిచ్చి మొక్కలు అల్లుకుని తరచూ సమస్య తలెత్తుతోంది. ఈ విషయమై 'అల్లుకున్న తీగలతో అంతరాయం' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించి శుభ్రం చేశారు. ఏఈ సంతోష్ పనులను పర్యవేక్షించారు.

స్పందనకు వందనం

వెలిగిన వీధి దీపం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: త్రోవగుంట అంబేడ్కర్ సామాజిక భవనం వీధిలో రెండు నెలలుగా దీపం వెలగడం లేదు. స్థానికుల సమాచారం మేరకు 'ఈనాడు - మేమున్నాం... మీకు తోడుగా'లో మంగళవారం సమస్య ప్రచురితం కావడంతో... సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొత్త దీపం ఏర్పాటు చేశారు.

గోకులం పథకానికి జవసత్వాలు

▸ పాడి రైతులకు ప్రోత్సాహం ▸ రాయితీపై షెడ్ల నిర్మాణానికి దరఖాస్తులు

న్యూస్‌టుడే – ఒంగోలు గ్రామీణం

గ్రామాల్లో వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంతకుముందు తెదేపా ప్రభుత్వ హయాంలో మాదిరిగానే మినీ గోకులాల నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. పశు పోషకులకు 90 శాతం; జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఆ మేరకు పశుసంవర్ధకశాఖ అధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఇప్పటికే ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

వీరికి తొలి ప్రాధాన్యం...

పథకం అమలులో చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు తొలి ప్రాధాన్యమిస్తారు. షెడ్ల నిర్మాణానికి అవసరమైన సొంత స్థలం కలిగి ఉండాలి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నుంచి నిధులు కేటాయిస్తారు. కోస్తా తీర ప్రాంతంలోని ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలాలకు యాభై చొప్పున; సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి మండలాలకు పాతిక చొప్పున... మొత్తం 225 యూనిట్లు కేటాయించారు. అర్హులైన రైతులు సమీప పశువైద్యాధికారులను సంప్రదించి... సంబంధిత వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ బసవ శంకరరావు తెలిపారు. ఇప్పటివరకు 483 దరఖాస్తులు అందాయి.



తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన గోకులం షెడ్డు

పశువుల గోకులం రాయితీ వివరాలు (రూ.ల్లో)

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారు వాటా
రెండు పశువులు	1,15,000	1,03,500	11,500
నాలుగు ఉంటే	1,85,000	1,66,500	18,500
ఆరు అయితే...	2,30,000	2,07,000	23,000
జీవాల షెడ్ల ఏర్పాటుకు...			
షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారు వాటా
20 గొర్రెలు, మేకలు	1,30,000	91,000	39,000
50 జీవాలకు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు ఉంటే	87,000	60,900	26,100
200 కోళ్లకు...	1,32,000	92,400	39,600

అప్పట్లో ఇలా...: 2018 ఆగస్టులో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పశుపోషకులను ప్రోత్సహించేందుకు గోకులం షెడ్లు మంజూరుచేసింది. తొలివిడతగా ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాలకు 200 యూనిట్లు మంజూరయ్యాయి. నాలుగో వంతు షెడ్ల నిర్మాణమూ పూర్తయ్యింది. వాటికి బిల్లులు చెల్లించే సమయానికి 2019 సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పథకంతో పాటు బిల్లుల చెల్లింపునూ గాలికొదిలేసింది. దీంతో ఆయా లబ్ధిదారులకు పెద్ద మొత్తంలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి విషయమై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఉత్సాహంగా చెకుముకి ప్రతిభా పరీక్షలు



చీమకుర్తి: బహుమతులు అందుకుంటున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి మండలస్థాయి ప్రతిభా పరీక్షలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. ముందుగా ఆయా పాఠశాలల్లో ప్రశ్నపత్రాలను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. చీమకుర్తిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో సాంఘిక సంక్షేమ గురుకులం, ప్రైవేటు పాఠశాలల విభాగంలో సీపీఎస్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. సీఐ ఎం.సుబ్బారావు, ఎంఈవో కె.శివాజీ, జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నూనె హేమసుందరం, పల్లపోతు శంకర్, తాళ్లూరి చలపతి బహుమతులు అందజేశారు. సంతనూతలపాడులో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఏపీ గురుకులం, ప్రైవేటు విద్యాసంస్థల్లో గురుదత్త పాఠశాల మొదటి స్థానంలో నిలిచాయి. మద్దిపాడులో తొమ్మిది, నాగులుప్పలపాడులో ఏడు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా మండలాల బాధ్యులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. విజేతలను అభినందించారు.

– న్యూస్‌టుడే, సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు

స్వేదం చిందించి స్వచ్ఛ యజ్ఞం

ఈనాడు-ఈటీవీ పిలుపునందుకుని విద్యార్థి లోకం కదంతొక్కింది. పలుగు, పార, చీపుర్లు చేత బట్టి స్వచ్ఛ సంకల్పంతో అడుగులేసింది. యువతరం.. శ్రమతత్వం.. నవతరం గళమెత్తగా అంటూ కనిగిరి, దర్శి పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో శ్రమదానం చేసింది. చారిత్రక కంభం చెరువులో స్వేదం చిందించి చిల్లచెట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి ఎందరిలోనో స్ఫూర్తి నింపింది.

◗ మూడు పట్టణాల్లో కదంతొక్కిన విద్యార్థి లోకం | ఈనాడు ఈటీవీ ఆధ్వర్యంలో జోరుగా శ్రమదానం



ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలో విద్యార్థుల ర్యాలీ





పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

కనిగిరిలో విద్యార్థులతో కలసి సీఐ ఖాజావలి శ్రమదానం



చెత్తను కుండీలో పోస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కనిగిరి, న్యూస్‌టుడే: ఈనాడు -ఈటీవీ ఆధ్వర్యంలో కనిగిరి ఏబీఆర్ ఇంజినీరింగ్ విద్యార్థులు మంగళవారం స్వచ్ఛతాహీ సేవలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఉప ఖజానా, పోలీస్ స్టేషన్ ఆవరణలను శుభ్రం చేశారు. పలుగు, పార, చీపుర్లు చేతపట్టి చిల్లచెట్లను తొలగించారు. ముందుగా ఏబీఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ అవుల జగిరెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ కరవది బాలాజీ విశ్వనాథ్, కనిగిరి సీఐ షేక్ ఖాజావలి శ్రమదానంలో పాల్గొన్నారు. వెలిగండ్ల, ఎంఈవో దేవిరెడ్డి రామిరెడ్డి, జేవీవీ రాష్ట్ర నాయకులు షేక్ గయాజ్ బాషా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏబీఆర్ కళాశాల ప్రిన్సిపల్ డా. దేవిరెడ్డి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

చారిత్రక కంభం చెరువులో..

కంభం: ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో వాసవీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, విద్యార్థులు చారిత్రక కంభం చెరువు కట్టపై స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లతో పాటు విద్యార్థులు సుమారు వందమంది రెండు బస్సుల్లో అక్కడికి చేరుకుని చెరువు గట్టుపై పేరుకున్న వ్యర్థాలు, చెత్తను తీసేశారు. వాసవి విద్యాసంస్థల కరస్పాండెంట్ గోళ్ల రత్నంబాబు, ప్రిన్సిపల్ రాము, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్శి: ఈనాడు- ఈటీవీ, పొట్టి శ్రీరాములు కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం దర్శి పట్టణంలోని పలు ప్రాంతాలు, పార్కు పరిసరాలను విద్యార్థులు శుభ్రం చేశారు. అక్కడి ఎద్ర చెరువు గట్టుపై ఉన్న చిల్లచెట్లను తొలగించారు. కళాశాల డైరెక్టర్ పెద్దిరాజు, సుమారు నలభైమంది ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ బాధ్యులను వదలం



సూరారెడ్డిపాలెంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

టంగుటూరు, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ విషయంలో ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని, ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతోనే సిట్‌ను ఏర్పాటు చేశామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కోర్టుల తీర్పుపై తమకు సమ్మతముందన్నారు. ప్రాథమికంగా నెయ్యి కల్తీ జరిగిందని వెలుగులోకి రావడంతో సిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. సుప్రీం కోర్టు నివేదిక ప్రకారం.. ఆధారాల సేకరణ ప్రాథమిక దశలోనే ఉందన్నారు. అన్ని ఆధారాలను, ల్యాబ్ నివేదికలను త్వరలోనే కోర్టుకు అందజేస్తామన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ జరిపినా తమకు అభ్యంతరం లేదన్నారు. ఒక వేళ అదే జరిగితే దాన్ని స్వాగతిస్తామన్నారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం అమలు చేస్తామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ అవకాశాలు కల్పించి వారి జీవితాలు మెరుగుపరిచేలా రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మందికి ఉచిత శిక్షణ కార్యక్రమాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఎంపీటీసీ సభ్యులు సంఘటితం కావాలి



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న వీరభద్రాచారి

ఒంగోలు గ్రామీణం: ఎంపీటీసీలను ప్రజాప్రతినిధులుగా గుర్తించాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జె.వీరభద్రాచారి డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఎంపీటీసీల చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. ఎంపీటీసీలు తమ అధికారాల సాధనకు సంఘటితం కావాలన్నారు. అనంతరం జిల్లా ఎంపీటీసీల సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొనుగుపాటి-2 ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వెంకటరావు (కొత్తపట్నం), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రవికుమార్ (యాదారం)లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలో వివిధ సంఘాల నేతలు, విద్యార్థులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తగదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి యువజన రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రం తీసుకునే ఈ నిర్ణయంతో చదువుకున్న విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కోసం విద్యార్థులు, యువకులు పోరాటం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పి.పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం పలువురు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ఆంధ్రులు పోరాటం చేస్తుంటే వారి మనోభావాలను పట్టించుకోకుండా కేంద్రం ముందుకు వెళ్లడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.వి.పిచ్చయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణానిధి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సి.హెచ్.వినోద్ పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: లింగ నిర్ధరణ పరీక్షలు చట్టరీత్యా నేరమనే విషయం ప్రతి ఒక్కరికీ తెలిసేలా స్కానింగ్ కేంద్రాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆమేరకు మంగళవారం వైద్యాధికారులు నగరంలోని కొన్ని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. చట్టంలో పేర్కొన్న నిబంధనలను తెలుగు, ఆంగ్ల భాషల్లో అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. నెలవారీ నివేదికలను ఆన్‌లైన్ ద్వారా పంపించాలన్నారు. అనుమతి లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



స్కానింగ్ కేంద్రం వద్ద బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ. 84/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

శిథిల బాటకిక సెలవు





సిద్ధమవుతున్న కొత్త రహదారి

ఛిద్రమైన రోడ్డుతో ఇన్నాళ్లూ పడిన అవస్థలు ఇక దూరం కానున్నాయి. జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుండ్లకమ్మ జలాశయం నుంచి జాతీయ రహదారి వరకు ఉన్న రెండు కి.మీ రోడ్డును రూ.1.2 కోట్లతో నిర్మిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వంద రోజుల్లోనే పనులు మొదలు పెట్టారు. శిథిల రోడ్డు తారు పెచ్చులను పొక్లెయిన్‌తో తవ్వేసి.. ఇలా మెటల్ పరిచి పనులు చేస్తున్నారు.

-ఈనాడు, ఒంగోలు

త్వరలో భూముల ఫ్రీ హోల్డింగ్ ప్రక్రియ పూర్తి



సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో జరుగుతున్న భూముల ఫ్రీ హోల్డింగ్ పరిశీలన ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఫ్రీ హోల్డింగ్ పరిశీలన ప్రక్రియపై అమరావతి నుంచి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పురోగతిని కలెక్టర్ వివరించారు. పరిశీలన కోసం మండలాల వారీగా ఎస్‌డీసీల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఉన్నతాధికారి పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా



సంతనూతలపాడు: జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి **ఆశా శ్రీ దండు** మూడో స్థానంలో నిలిచినట్లు సంతనూతలపాడు జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాంచీలో జరిగిన ఆల్ ఇండియా సబ్ జూనియర్ పోటీల్లో ఆశాశ్రీ దండు మూడో స్థానంలో నిలిచినట్లు చెప్పారు. పీడీలు బి.శ్రీనివాసరెడ్డి, కె.మల్లికారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన ఎంపీ మాగుంట



లోకేశ్‌తో ఎంపీ మాగుంట, రాఘవరెడ్డి

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు రాఘవరెడ్డి... రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో... లోకేశ్‌కు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలు, అభివృద్ధి పనుల ప్రగతిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

పీజీ వైద్య విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఏడుకొండలరావు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలలో జనరల్ సర్జరీపై జోనల్ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో... ఒంగోలు వైద్య కళాశాల పీజీ విద్యార్థులు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా జయచంద్ర, సునీల్‌వర్మ, మనోజ్ఞ, వశిష్ట, లోహిత, ప్రవీణ్‌కుమార్ బృందాన్ని ప్రిన్సిపల్ ఏడుకొండలరావు అభినందించారు. పేపర్ ప్రజెంటేషన్‌లోనూ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు తెలిపారు.

దసరా ఉత్సవాలు... ట్రాఫిక్ మళ్లింపు

◗ విజయవాడ మీదుగా నడిచే వాహనాల రాకపోకల్లో మార్పులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా.. నగరం మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. ఈ నెల 2 నుంచి 13వ తేదీ వరకు ఈ మళ్లింపులు ఉంటాయని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

భారీ, చిన్న వాహనాలు ఇలా వెళ్లాలి..

◗ హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, స్వాతి కూడలి, కనకదుర్గా పైవంతెన, కృష్ణలంక, కనకదుర్గమ్మ వారధి, తాడేపల్లి మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి. ◗ హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను.. ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, నూజివీడు, హనుమాన్‌జంక్షన్, ఏలూరు మీదుగా విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. అదే విధంగా చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వై.కూడలి, కబేలా సెంటర్, సీవీఆర్ పైవంతెన, పైపులరోడ్డు, కండ్రిక, బోడపాడు ఆర్‌యూబీ, ఔటర్ రింగ్‌రోడ్డు, ముస్తాబాద, చిన అవుటపల్లి మీదుగా విశాఖపట్నం మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి. ◗ విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను హనుమాన్‌జంక్షన్, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, పెనమూడి వారధి, రేపల్లె, చీరాల, ఒంగోలు మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గన్నవరం, నిడమానూరు, బెంజిసర్కిల్, కనకదుర్గమ్మ వారధి మీదుగా చెన్నైకు పంపిస్తారు. రామవరప్పాడు వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగితే.. తాడిగడప 100 అడుగుల రోడ్డు మీదుగా బందరురోడ్డు, అక్కడి నుంచి బెంజిసర్కిల్ మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెనుతిరుగుతాయి.

◗ గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను బుడంపాడు, తెనాలి, పెనుమూడి వారధి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు, విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గుంటూరు, కనకదుర్గమ్మ వారిధి, బెంజిసర్కిల్ పైవంతెన, రామవరప్పాడు, నిడమానూరు, గన్నవరం మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



మాట్లాడుతున్న అఖిల భారత క్రైస్తవ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు విజయరాజు, చిత్రంలో సంఘం నాయకులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని అఖిల భారత క్రైస్తవ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఎన్జీవో హోమ్‌లో మంగళవారం జిల్లా పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో దళిత క్రైస్తవులకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాలు నోరు తెరవాలన్నారు. కేంద్ర ప్రభుత్వాలు దీనిపై ఎన్నో కమిషన్లు వేయగా, నివేదికలిచ్చాయని, దీనిపై మీనమేషాలు లెక్కించడం తగదన్నారు. ఎస్సీ హోదా సాధనకు భవిష్యత్తు కార్యాచరణ నిమిత్తం సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే నెలలో ఒంగోలులో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఉపాధ్యక్షులు బిషప్ శ్యాంసన్, ఐజాక్‌బాబు పాల్గొన్నారు.

రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ఒంగోలు: రైతులకు రాయితీ మినుము విత్తనాలు అందజేస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: పశుసంవర్ధక శాఖ ద్వారా 90 శాతం రాయితీపై మినీ గోకులాలు అందజేస్తున్నట్లు జేడీఏ బేబీరాణి తెలిపారు. పోతవరంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. రాయితీపై పశువుల దాణా, బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 15 నుంచి పాతిక శాతం రాయితీపై శనగ విత్తనాలు అందజేయన్నున్నట్లు ఏవో వెంకటరావు తెలిపారు. క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంటను పరిశీలించారు.


సంతనూతలపాడు: ప్రకృతి వ్యవసాయ విధానాలతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు పొందవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.సుభాషిణి పేర్కొన్నారు. మైనంపాడు, ఎండ్లూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో మాట్లాడారు. వివిధ పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను జిల్లా వనరుల కేంద్రం ఏవో వి.వి.శేషమ్మ వివరించారు. రాయతీపై మినుము విత్తనాలు అందిస్తున్నట్లు ఏవో పి.పావని తెలిపారు.

మద్దిపాడు: దొడ్డవరం, గార్లపాడు; **ఒంగోలు గ్రామీణం:** యరజర్ల, ఉలిచి; **చీమకుర్తి:** చినరావిపాడు, బూసరపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏవోలు కె.రమేష్‌బాబు, కిషోర్, డీవీ భాస్కర్ పాల్గొన్నారు. రాయితీ పరికరాలు, విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమష్టి కృషితోనే స్వర్ణాంధ్ర సాకారం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని ఏకేయూ ప్రిన్సిపల్ రాజమోహన్ పేర్కొన్నారు. వర్సిటీలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2047 నాటికి భారతావనికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తవుతుందన్నారు. ఆ సమయానికి రాష్ట్రం అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి చెందాలన్నారు. ఈ లక్ష్యసాధనకు పన్నెండు సూత్రాలు ప్రతిపాదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ భారతీదేవి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపా నేత సుబ్బారావు కన్నుమూత



చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ముప్పూరి సుబ్బారావు (65) మంగళవారం రాత్రి కన్నుమూశారు. మధ్యాహ్నం అస్వస్థతకు గురవ్వడంతో ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. తెలుగు రైతు విభాగం నాయకుడిగా కర్షక సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పలువురు నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు రోటరీ క్లబ్ మాజీ కార్యదర్శి చలమయ్య, కుటుంబసభ్యులు తెలిపారు.

కేజీబీవీ దరఖాస్తుల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్

ఒంగోలు నగరం: సమగ్రశిక్ష పరిధిలోని కేజీబీవీల్లో ఖాళీ పోస్టులను ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో సుభద్ర తెలిపారు. నోటిఫికేషన్ విడుదల చేశారని, సబ్జెక్టు, రోస్టర్, గౌరవ వేతనం వివరాలు కేజీబీవీ వెబ్‌సైట్‌లో ఉంచారన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేటప్పుడు కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నందున వాటి పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచారన్నారు. సమస్య ఉంటే 70750 39990 కు సంప్రదించాలన్నారు.

డీఎస్వో ఉదయభాస్కర్‌కు సన్మానం : ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బదిలీపై కోనసీమ జిల్లా డీఎస్వోగా వెళ్తున్న అడపా ఉదయభాస్కర్‌ను ప్రకాశం భవన్‌లో మంగళవారం ఘనంగా సత్కరించారు. కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు ఊతకోలు శ్రీనివాసరావు, సహాయ పౌర సరఫరాల అధికారి పుల్లయ్య, రెవెన్యూ సంఘం ప్రతినిధులు డానియేలు, కె.వెంకటేశ్వర్లు ఆయన సేవలను కొనియాడారు.